



RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.

సంచిక : 281 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | గురువారం | 29-1-2026 పేజీలు-8 | వెల: రూ. 5.00

# మహారాష్ట్ర రాజకీయాల్లో తీరని విషాదం

## విమాన ప్రమాదంతో డిప్యూటి సీఎం అజిత్ పవార్ దుర్మరణం

- మహారాష్ట్ర డిప్యూటీ సీఎం సహా ఐదుగురు మృతి
- ఎన్నికల ప్రచారం కోసం వెళ్తుండగా దుర్ఘటన
- విజిబిలిటీ లేకపోవడంతోనే ప్రమాదం జరిగిందన్న విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు
- పవార్ మృతిపై రాష్ట్రపతి, ప్రధానమంత్రి దిగ్భ్రాంతి
- కుట్ర కోణం ఉందన్న మమత.. దర్యాప్తునకు డిమాండ్

హైదరాబాద్/ముంబై, -జనవరి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
మహారాష్ట్ర డిప్యూటీ సీఎం, ఎన్సీపీ అధినేత అజిత్ పవార్ (66) దుర్మరణం చెందారు. బుధవారం ఉదయం ఆయన ప్రయాణిస్తున్న విమానం పుణె జిల్లాలోని బారామతిలో కుప్పకూలింది. ఈ ఘటనలో పవార్‌తో పాటు ముంబై వ్యక్తిగత భద్రతాధికారి (పీఎస్‌వో) వదీప్ జావద్, విమానాన్ని నడుపుతున్న కెప్టెన్ సుమిత్ కపూర్, కెప్టెన్ శాంభవి పాఠక్, ఫ్లైట్ అటెండెంట్ పింకీ మాలి మృత్యువాతపడ్డారు. జిల్లా పరిషత్ ఎన్నికల ప్రచారం కోసం ముంబై నుంచి బారామతి వెళ్తుండగా ఉదయం 8.45 గంటల ప్రాంతంలో ఎయిర్‌పోర్టు రన్‌వేకు సమీపంలో ఈ విమానం కుప్పకూలింది. ప్రమాద తీవ్రతకు విమానం రెండు ముక్కలై మంటలు చెలరేగాయి. ఘటనాస్థలిలోనే విమానంలోని వాళ్లందరూ చనిపోయారని ప్రత్యక్షసాక్షులు పేర్కొన్నారు.

-మిగతా 2 లో








### కేంద్ర ప్రభుత్వం సరికొత్త

# ఆధార్ యాప్ లాంచ్


- సరళంగా,సురక్షితంగా ఉండేలా చర్యలు
- ఈ యాప్ ద్వారా వెంటనే ఆధార్ వెరిఫికేషన్
- ఎలాంటి సంక్లిష్టత లేకుండా యూజర్లకు అందుబాటులోకి సేవలు

న్యూఢిల్లీ,
కేంద్ర ప్రభుత్వం సరికొత్త ఆధార్ యాప్‌ను లాంచ్ చేసింది. దేశ డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాలను బలోపేతం చేసే లక్ష్యంతో దీనిని తీసుకొచ్చింది. ఈ కొత్త యాప్‌తో ఆధార్ సర్వీసులు మరింత సరళంగా, సురక్షితంగా, యూజర్ ఫ్రెండ్లీగా మారనున్నాయి. బుధవారం ఢిల్లీలో డాక్టర్.అంబేడ్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఈ యాప్‌ను జాతికి అంకితం చేశారు. 2009లో ఇదే రోజున అంటే జనవరి 28న ఆధార్‌ను లాంచ్ చేశారు ఈ యాప్ ద్వారా వెంటనే ఆధార్ వెరిఫికేషన్ చేసుకోవచ్చు. చిరునామా, మొబైల్‌నంబర్‌ను అప్‌డేట్ చేసుకునే సౌలభ్యం ఉంది. ఆధార్ కాంటాక్ట్ కార్డ్ ద్వారా అత్యంత గోప్యంగా కాంటాక్ట్ వివరాలను పంచుకోవచ్చు. ఎవరికైనా షేర్ చేసినప్పుడు మొత్తం వివరాలు కాకుండా అవసరమైనవి మాత్రమే కనిపించేలా ఏర్పాటు చేసుకోవచ్చు. ఎలాంటి సంక్లిష్టత లేకుండా యూజర్లకు అందుబాటులోకి సేవలు ఈ యాప్ ద్వారా ఐదుగురి వరకు ప్రొల్ వివరాలు క్రియేట్ చేసుకోవచ్చు.

### మున్సిపల్ ఎన్నికల్లోను

# సత్తాచాటుతాం

## పార్టీ పనితీరు, గెలుపు అవకాశాలు లక్ష్యంగా ఎంపిక



- పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ ఆధ్వర్యంలో అభ్యర్థుల ఎంపిక
- మున్సిపల్ ఎన్నికలను కాంగ్రెస్ సీరియస్‌గానే తీసుకుంది
- సీఎం లేనప్పడు మంత్రులు తనను కలవడంలో తప్పలేదు
- దీనిపై అసత్య కథనాలు రాయడం సరికాదు
- మిడియాతో డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క

ఖమ్మం -జనవరి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
: మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల ఎంపిక అనేది కేవలం ఒకరిద్దరి నిర్ణయం కాకూడదని, అత్యంత పారదర్శకంగా , సమిష్టిగా సాగాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఆయా మున్సిపాలిటీల బాధ్యతలు చూస్తున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు , సీనియర్ నాయకులు అందరూ కలిసి చర్చించి, ఏకాభిప్రాయంతో అభ్యర్థులను ఖరారు చేయాలని సూచించారు. ఖమ్మం జిల్లాలో మీడియాతో మాట్లాడిన భట్టి.. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అందరూ మున్సిపల్ ఎన్నికలను సీరియస్ గా తీసుకొని పార్టీ నేతలను సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లాలని సూచించారు. అభ్యర్థుల ఎంపికలో అందరినీ కలుపుకుని -మిగతా 2 లో

### ఘనంగా

# మహాజాతర ప్రారంభం

- కొలువు తీరిన సారలమ్మ
- పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులు
- గద్దెలకు చేరిన పగిడిద్దరాజు, గోవిందరాజు
- నేడు సమ్మక్క రాక..
- పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులు

2 లో



# తొలిరోజు 902 నామినేషన్లు..

- కాంగ్రెస్ 382, బీఆర్ఎస్ 258, బీజేపీ నుంచి 169 దాఖలు

2 లో






### అమెరికాలో మంచు

# తుపాను బీభత్సం

## అమెరికాలోని 14 రాష్ట్రాల్లో 38 మంది మృతి


వాషింగ్టన్
అమెరికాలో మంచు తుపాను బీభత్సం సృష్టిస్తోంది. ఈ తుపాను ప్రభావంతో భారీగా మంచు కురువడం, గడ్డకట్టే ఉష్ణోగ్రతలతో ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. ఈ తుపాను కారణంగా అమెరికాలోని 14 రాష్ట్రాల్లో 38 మంది మృతి చెందారు. ఈ నెల 23 నుంచి మంచు తుపాను అమెరికాలో తన ప్రభావాన్ని చూపిస్తోంది. భారీగా కురుస్తున్న మంచుతో రాకపోకలు స్థంభించిపో యాయి. భారీ సంఖ్యలో విమానసర్వీసులు రద్దు చేశారు. విద్యుత్‌కు, మంచినీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అనేక ఇళ్లు మంచులో కూరుకునిపోయాయి. అనేక మంది నిరాశ్రయులయ్యారు. టెన్నెస్సీలోని నాష్‌విల్లేలో సుమారు 7 లక్షల జనాభా ఉండగా, వీరిలో రెండు లక్షల మంది నిరాశ్రయులయ్యారని అంచనా. న్యూయార్క్ నగరంలోనే పది మంది మరణించారు.

-మిగతా 2 లో

### కరీంనగర్ కార్పొరేషన్ లో

# కాంగ్రెస్ జెండా ఎగరాలి

- అభ్యర్థుల ఎంపికకు సమర్థత ఆధారంగా సర్వే
- పట్టణాల అభివృద్ధికి సమగ్ర ప్రణాళికతో సాగుతున్నాం
- డీసీసీ సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్



కరీంనగర్, -జనవరి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
:కరీంనగర్ కార్పొరేషన్ లో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కరీంనగర్ కార్పొరేషన్ లో అభ్యర్థుల ఎంపికకు 66 సీట్లలో సర్వే జరుగుతుందని.. ఎవరికివారు అంచనా వేసుకోండని ఆశావహులకు సూచించారు. బుధవారం కరీంనగర్ డీసీసీ ఆఫీసులో మున్సిపల్ ఎన్నికల్లో పోటీకి ఆశావహులతో జరిగిన సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. -మిగతా 2 లో

### వికసిత్ భారత్ వైపు దేశం

# పయనిస్తోంది

## గత 11 ఏళ్లలో భారత ఆర్థిక వ్యవస్థ వేగంగా అభివృద్ధి

- పదేళ్లలో పేదల కోసం 4కోట్ల ఇళ్ల నిర్మాణం
- జల్ జీవన్ మిషన్ ద్వారా గ్రామాలకు తాగునీరు
- వందేభారత్, అమృత్ భారత్ రైళ్ల ద్వారా సేవలు
- ఆయుష్మాన్ భారత్‌తో కోట్లమందికి వైద్యం
- వరిధాన్యం ఉత్పత్తిలో ప్రపంచంలో నంబర్ వన్
- అక్వా, పాల ఉత్పత్తుల్లో భారత్ ముందంజ
- జిఎస్టీ శ్లాబుల తగ్గింపుతో పెరిగిన కొనుగోలు శక్తి
- పవర్ టెక్నాలజీ హబ్‌గా రూపొందుతున్న భారత్
- గ్రీన్ ఎనర్జీ రంగంలో పవర్ హౌస్‌గా భారత్
- పార్లమెంటు ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగం



న్యూఢిల్లీ, -జనవరి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
దేశం వికసిత్ భారత్ వైపు పయనిస్తోందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చెప్పారు. పేదల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, గత పదేళ్లలో పేదల కోసం 4కోట్ల ఇళ్లు కట్టించామని, జల్ జీవన్ మిషన్ ద్వారా గ్రామాలకు తాగునీరు అందిస్తున్నామని రాష్ట్రపతి తెలిపారు. 'పదేళ్లలో 25కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తీసుకొచ్చాం. సామాజిక న్యాయం ప్రాతిపదికన కేంద్రం పనిచేస్తోందన్నారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల తొలి రోజైన బుధవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉభయసభల్ని ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ప్రసంగిస్తూ...వందేభారత్, అమృత్ భారత్ రైళ్ల ద్వారా సేవలు విస్తరించాం. ప్రతి పౌరుడికి జీవిత బీమా కల్పించడం ప్రభుత్వ లక్ష్యం. ఆయుష్మాన్ భారత్‌తో కోట్లమందికి వైద్యసేవలందిస్తున్నాం. వరి ఉత్పత్తిలో ప్రపంచంలోనే భారత్ నెం1 స్థానంలో నిలిచింది. -మిగతా 2 లో

### మున్సిపల్ ఎన్నికల్లో

# కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

- అప్పుల సంఖ్య పెంచి కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు లెక్కలు..
- రెండు సంవత్సరాల్లో అన్ని రంగాల్లో కాంగ్రెస్ పార్టీ విఫలం
- తెలివిలేని వ్యక్తి రాష్ట్రాన్ని పాలిస్తున్నారు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపణ



హైదరాబాద్ -జనవరి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
ప్రజల గురించి పట్టించుకునే తీరిక, ఉద్దేశ్యం కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని.. అందుకే ఇచ్చిన అన్నీ హామీలను తుంగలో తొక్కిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. అన్ని వర్గాలను మోసం చేస్తున్న కాంగ్రెస్ కు ప్రజలు బుద్ధి చెప్పి మున్సిపల్ ఏన్నికల్లో ప్రజకు బీఆర్ఎస్ వెంట నిలబడతారని కేటీఆర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

-మిగతా 2 లో

### యూజీసీ కొత్త రూల్స్

# ఉపసంహరించాలి

- దేశవ్యాప్తంగా జనరల్ క్యాటగిరీ విద్యార్థుల ఆందోళన
- మోదీ, షా పోస్టర్లపై నల్ల ఇంకు
- నిబంధనలపై విచారణకు సుప్రీం కోర్టు అంగీకారం

ఢిల్లీ -
: యూజీసీ కొత్త నిబంధనలను వ్యతిరేకిస్తూ జనరల్ క్యాటగిరీ విద్యార్థులు, అగ్ర కులాల సభ్యులు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న నిరసనలు బుధవారం నాలుగో రోజుకు చేరుకున్నాయి. ఉత్తరప్రదేశ్, బీహార్‌లో విద్యార్థుల నిరసనలు కొనసాగాయి. యూజీసీ నిబంధనలను నిరసిస్తూ అగ్రకులాలకు చెందిన విద్యార్థులు శిరోముండనం చేసుకున్నారు. బీహార్‌లో నిరసనకారులు ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా పోస్టర్లపై నల్ల ఇంకు చల్లి తమ నిరసన తెలిపారు.యూపీలో ఓ నిరసనకారుడు రక్తంతో ప్రధాని మోదీకి లేఖ రాశారు. ఇక నిబంధనలను వ్యతిరేకిస్తూ బీజేపీలో రాజీనామాల పర్వం కొనసాగుతున్నది. రాయ్‌బరేలీలో బీజేపీ కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు తన పదవికి రాజీనామా చేశారు. కాగా, ఈ నిబంధనలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు అంగీకరించింది. ధర్మాసనం బుధవారం ప్రాథమిక వాదనలు ఆలకించింది.



# మాహారాష్ట్ర రాజకీయాల్లో తీరని విషాదం

మొదటి తరువాయి

**ప్రముఖుల సంతాపం**

పవార్ మరణంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి మోదీ, హోంమంత్రి అమిత్ షా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మహారాష్ట్ర అభివృద్ధికి పవార్ ఎంతో కృషి చేశారని ముర్ము అన్నారు. అట్టడుగు స్థానం నుంచి ప్రజా నాయకుడిగా ఎదిగిన పవార్ ప్రజల హృదయాల్లో ఎప్పుడూ నిలిచే ఉంటారని మోదీ తెలిపారు. పవార్ మరణం ఎన్డీయే కుటుంబానికి తీవ్ర నష్టమని అమిత్ షా అన్నారు. పవార్ కుటుంబానికి మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్, కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ, పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తదితరులు సానుభూతి తెలియజేశారు. రాష్ట్రంలో మూడు రోజులు సంతాప దినాలుగా పాటిస్తామని సీఎం ఫడ్నవీస్ తెలిపారు. ప్రభుత్వ లాంఛనాలతో గురువారం ఉదయం 11 గంటలకు జరగనున్న అంత్యక్రియలకు ప్రధాని, హోం మంత్రి హాజరయ్యే అవకాశమున్నదని సంబంధిత వర్గాలు తెలిపాయి.

**ప్రమాదంలో కుట్ర కోణం**

పవార్ విమాన ప్రమాదంలో రాజకీయ కుట్ర కోణం కనిపిస్తున్నదని బెంగాల్ సీఎం మమతా బెనర్జీ అనుమానం వ్యక్తం చేశారు. 'పవార్ బీజేపీని వీడాలన్న యోచనలో ఉన్నారని రెండురోజుల కిందటే విన్నా. ఇంతలోనే ఈ ప్రమాదం జరిగింది. దేశంలోని రాజకీయ నాయకుల భద్రతపై ఈ ప్రమాదం అనేక ప్రశ్నలను లేవనెత్తుతున్నది. ఈ ఘటనపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరిపించాలి. మరే ఇతర ఏజెన్సీలపై మాకు నమ్మకం లేదు' అని మమత అన్నారు. ఆమె వ్యాఖ్యలను తాము సమర్థిస్తున్నామని, ఈ ఘటనపై పారదర్శకమైన దర్యాప్తు చేయించాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్, ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్, శివసేన యూబీటీ ఎంపీ అనిల్ దేశాయ్, కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ తదితరులు డిమాండ్ చేశారు. కాగా ఇది ప్రమాదవశాత్తు జరిగిన దుర్ఘటన అని, దీనికి రాజకీయ రంగు పులమద్దని ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్ అన్నారు.

2023లో అదే మోడల్ విమాన ప్రమాదం

ఢిల్లీకి చెందిన వీఎస్ఆర్ సంస్థకు చెందిన లియర్ జెట్-45 మోడల్ విమానంలో చివరగా అజిత్ పవార్ ప్రయాణించారు. ఇదే మోడల్ విమానం 2023లో ముంబై విమానాశ్రయంలో క్రాష్ ల్యాండ్ అయ్యి రెండు ముక్కలైంది. ప్రమాద ంలో ఆరుగురు ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కాగా, తమ విమానం 100 శాతం సురక్షితమైనదని వీఎస్ఆర్ సంస్థ చెబుతున్నది.

**కళ్లద్దాలు, వాచీని చూసి..**

విమాన ప్రమాద సమయంలో నాలుగైదు పేలుడు శబ్దాలు వినిపించాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. విమానం కూలగానే పెద్దయెత్తున మంటలు వచ్చాయని, ప్రమాద తీవ్రతకు రెండు మృతదేహాలు బయటకు ఎగిరిపడ్డాయన్నారు. కళ్లద్దాలు, వాచీని చూసి అజిత్ పవార్‌ను గుర్తించి బయటకు లాగామని, అయితే అప్పటికే నష్టం జరిగిపోయిందని ఓ ప్రత్యక్ష సాక్షి కన్నీటిపర్యంతమయ్యారు.

# మున్సిపల్ ఎన్నికల్లోను సత్తాచాటుతాం

మొదటి తరువాయి

పోవడం వల్ల పార్టీలో అంతర్గత విబేధాలు రాకుండా ఉంటాయని, ఇది ఎన్నికల్లో పార్టీ విజయావకాశాలను మెరుగుపరుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా పార్టీ మండల , పట్టణ స్థాయి నాయకులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ ఈ ప్రక్రియను విజయవంతం చేయాలని శాసనసభ్యులకు దిశానిర్దేశం చేశారు. అభ్యర్థుల ఎంపికకు సంబంధించి భట్టి విక్రమార్క కొన్ని కీలక మార్గదర్శకాలను విడుదల చేశారు. కేవలం రాజకీయ ప్రాధాన్యతలకు కాకుండా, క్షేత్రస్థాయిలో గెలిచే సామర్థ్యం ఉన్న అభ్యర్థులకే టికెట్లు కేటాయించాలని ఆదేశించారు. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను నమ్మిన వారు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లే అభ్యర్థులపై దృష్టి సారించాలని కోరారు. ప్రభుత్వం ఇప్పటికే అమలు చేస్తున్న 'ఆరు గ్యారెంటీలు' , ఇతర అభివృద్ధి పనులను ఓటర్లకు వివరించి, వారి మద్దతు పొందే నాయకులను గుర్తించడం ఈ ఎన్నికల్లో అత్యంత కీలమని ఆయన పునరుద్ఘాటించారు. మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ ప్రకారం, నామినేషన్ల స్వీకరణ ఇప్పటికే ప్రారంభమైన నేపథ్యంలో అభ్యర్థుల ఖరారు ప్రక్రియను వేగవంతం



చేయాలని భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 11న జరగనున్న పోలింగ్‌లో కాంగ్రెస్ అభ్యర్థులు మెజారిటీ స్థానాల్లో విజయం సాధించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు , మున్సిపాలిటీ బాధ్యులు తదేక దృష్టితో పనిచేసి, ఫిబ్రవరి 13న వెలువడే ఫలితాల్లో పార్టీ జెండా ఎగిరేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ విజయాలను ఆయుధంగా మలచుకుని, ప్రతిపక్షాలకు అవకాశం ఇవ్వకుండా మున్సిపల్ ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలని పార్టీ శ్రేణులను ఆయన ఉత్సాహపరిచారు. మున్సిపల్ ఎన్నికల్లోనూ మెజారిటీ స్థానాలు గెలిచి రాష్ట్ర అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తామన్నారు.. నగరాల్లో మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేస్తామని చెప్పారు. దేశంలోనే ఏ రాష్ట్రంలో లేని సంక్షేమ పథకాలను ప్రజా ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఎన్సిపల్ ఎన్నికల్లో పొత్తుల అంశం పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ నిర్ణయం తీసుకుంటారని చెప్పారు భట్టి. తమ కేబినెట్ అంతా ఉమ్మడి కుటుంబంలా పనిచేస్తుంది.. రాష్ట్ర భవిష్యత్తే తమ లక్ష్యమని అన్నారు. ప్యూర్, క్యూర్, రేర్ సమగ్ర విధానంతో తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం 2047 విజన్ డాక్యుమెంట్

విడుదల చేశామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి దే మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో తనకు కొన్ని సూచనలు చేశారని చెప్పారు. మంత్రులు తెలియజేసిన సమస్యలను తాను ముఖ్యమంత్రికి వివరించానని చెప్పారు. ప్రజాభవన్లో మంత్రుల భేటీపై కొందరు పిచ్చి భ్రమల్లో ఉండి పిచ్చి రాతలు రాస్తున్నారని ఫైర్ అయ్యారు భట్టి. మంత్రులు డిప్యూటీ సీఎంను కలవకపోతే ఇంకెవరిని కలుస్తారని ప్రశ్నించారు భట్టి.

సిఎం లేనప్పుడు ప్రధాన సమస్యలను చర్చించేందుకు తనతో కలిసినట్లు వెల్లడించారు.

# ఘనంగా మహాజాతర ప్రారంభం

**కొలువు తీరిన సారలమ్మ**
**పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులు**
**గద్దెలకు చేరిన పగిడిద్దరాజు, గోవిందరాజు**
**నేడు సమ్మక్క రాక..**
**పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులు**

**వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి**

మేడారం.. జనసంద్రమైంది. రెండేండ్లకోసారి జరిగే సమ్మక్క-సారలమ్మ మహాజాతర బుధవారం ఘనంగా ప్రారంభమైంది. వేలాది మంది సందర్శకులు పోటెత్తారు. జయజయ ధ్వానాల నడుమ, డోలు వాయిద్యాలు, ఆదివాసీ యువతుల నృత్యాలు, మహిళల పొర్లుదండాల మధ్య కాక కిరణ్ కొమ్ము ఊదుతూ ముందుకు సాగగా.. సారలమ్మను ప్రధాన వడ్డె కాక సారయ్య గద్దెలపై ప్రతిష్టించారు. బుధ వారం సాయంత్రం సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు గద్దెలపైకి చేరడంతో మేడారం మహాజాతరలో తొలి అంకం ముగిసింది. గురువారం సాయంత్రం సమ్మక్క రాక కోసం భక్తులు పెద్దఎత్తున తరలివస్తున్నారు. కన్నెపల్లిలోని సారలమ్మ గుడి వద్ద ఆదివాసీ యువతులు నీటితో కడిగి ముగ్గులు వేసి ప్రత్యేక పూజలు జరిపారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క, ములుగు జిల్లా కలెక్టర్ దివాకర, ఐటిడిఎ పీవో చిత్రా మిశ్రా, అధికారులు ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు.



ప్రధాన పూజారి కాక సారయ్య సారలమ్మను తీసుకొని వస్తుండగా, దారికి అడ్డంగా నినాదాలు చేస్తూ.. పొర్లు దండాలు చేస్తూ స్వాగతం పలికారు. సారలమ్మను తీసు కొస్తున్న వడ్డె కాక సారయ్య గద్దెలకు చేరుకోవడానికి పోలీసు అధికారులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ములుగు డీఎస్పీ రవీందర్ నాయకత్వంలో రోప్ పార్టీని ఏర్పాటు చేసి వడ్డెలు సురక్షితం గా గద్దెల వద్దకు రావడానికి కీలకంగా మారారు. ఆదివాసీ సంఘాల వాలంటీర్లు, తుడుందెబ్బ కార్యకర్తలు వడ్డెలకు రక్షణ కవచంగా నిలిచి కన్నెపల్లి నుంచి 3 కిలోమీటర్ల దూరంలోని మేడారం గద్దెల వరకు ముందుకు సాగారు. ప్రధాన పూజారి కాక సారయ్య, ఇతర పూజారులు సారలమ్మను గద్దెపైకి ప్రతిష్టించిన అనంతరం మంత్రి సీతక్క, కలెక్టర్ దివాకర, అధికారులు పూజలు నిర్వహించారు.

**కొలువుతీరిన పగిడిద్దరాజు**

మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం పూనుగొండ్ల నుంచి పెనక వంశీయులు సమ్మక్క భర్త పగిడిద్దరాజును గద్దెపై ప్రతిష్టించారు. మంగళవారమే పూనుగొండ్ల నుంచి పెనక వంశీయులు పగిడె రూపంలో వున్న పగిడిద్దరాజును తీసుకొని కాలినడకన బయలుదేరి రాత్రి గోవిందరావుపేట మండలంలోని లక్ష్మీపురంలో బస చేశారు. బుధవారం మళ్లీ కాలినడకన బయలుదేరి సాయంత్రానికి మేడారం గద్దెలకు చేరుకొని పడిగె రూపంలో వున్న పగిడిద్దరాజును ప్రతిష్టింపజేశారు.

**గోవిందరాజుల ప్రతిష్ట**

ములుగు జిల్లాలోని ఏటూర్‌నాగారం మండలం కొండాయి నుంచి ప్రధాన వడ్డె పోదెం బాబురావు, ఇతర పూజారులు పడిగె రూపంలోని గోవిందరాజును తీసుకొచ్చి గద్దెపై ప్రతిష్టించారు.

**నేడు సమ్మక్క రాక**

సారలమ్మ గద్దెలపై కొలువుతీరడంతో మేడారం జాతర ప్రారంభం కాగా, గురువారం సాయంత్రం చిలుకలగుట్ట నుంచి సమ్మక్కను ప్రధాన పూజారి కొక్కెర కిష్టయ్య తీసుకురానున్నారు. ఇందుకు అధికార యంత్రాంగం, సమ్మక్క పూజారులు అన్ని ఏర్పాట్లు చేశారు. బుధవారం రోప్ పార్టీ చిలుకలగుట్ట నుంచి సమ్మక్కను తీసుకొచ్చే ప్రక్రియకు సంబంధించి రిహార్సల్స్ నిర్వహించారు. కన్నెపల్లి నుంచి సారలమ్మను తీసుకొచ్చే క్రమంలో ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ నేతృత్వంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ములుగు డిఎస్పీ రవీందర్ ఆధ్వర్యంలో రోప్ పార్టీతో వడ్డెల ను సురక్షితంగా జంపన్నవాగు మీదుగా గద్దెల వరకు తీసుకొచ్చారు.

# మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

మొదటి తరువాయి

మున్సిపల్ ఎన్నికల్లో గొప్ప విజయం సాధించాలని పార్టీ శ్రేణులకు కేటీఆర్ పిలుపునిచ్చారు. తెలంగాణ భవన్‌లో మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ తన అనుచరులతో కలిసి బీజేపీకి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరగా, పార్టీ కండువా కప్పి కేటీఆర్ సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ కాంగ్రెస్ పార్టీ, రేవంత్ రెడ్డిపై విరుచుకుపడ్డారు. రెండు సంవత్సరాల్లో అన్ని రంగాల్లో విఫలం అయిన కాంగ్రెస్ పార్టీ పరిపాలనకు వ్యతిరేకంగా అందరూ కలిసికట్టుగా పోరాడి అద్భుతమైన విజయం సాధించాలన్నారు. ఈ ఎన్నికల్లో అందరు కలిసి సమిష్టిగా ఎన్నికల్లో పోరాడాలని కేటీఆర్ కోరారు. కేవలం మున్సిపల్ ఎన్నికలు మాత్రమే కాకుండా రానున్న ప్రతి ఎన్నికల్లోనూ గులాబీ జెండాకు, కారు గుర్తుకు మద్దతు ఇచ్చి కేసీఆర్‌ను తిరిగి ముఖ్యమంత్రిని చేయాలని ఆయన పిలుపునిచ్చారు. రెండు సంవత్సరాలుగా రాష్ట్రంలో కాంగ్రెస్, 12 ఏండ్లుగా దేశంలో అధికారంలో ఉన్న బీజేపీ ఎలాంటి అభివృద్ధి చేయకుండా టైంపాస్ చేస్తున్నాయని, అందుకే తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీల పట్ల తీవ్రమైన వ్యతిరేకత ఏర్పడిందని కేటీఆర్ అన్నారు. తెలివిలేని వ్యక్తి రాష్ట్రాన్ని పాలిస్తున్నారని, రేవంత్ రెడ్డికి పరిపాలన చేతకావడం లేదని.. అందుకే గత ప్రభుత్వంపై అడ్డగోలు విమర్శలు చేస్తూ పరిపాలనను వదిలిపెట్టారు. అడ్డగోలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి వాటి అమలును పూర్తిగా విస్మరించారని, హామీల అమలును ప్రశ్నిస్తే బెదిరింపులు, కేసులు, అబద్దాలకు దిగుతున్నారని కేటీఆర్ ఆరోపించారు.


# అమెరికాలో మంచు తుపాను బీభత్సం

మొదటి తరువాయి

టెక్సాస్‌లో ముగ్గురు మంచు చెరువులో పడి మరణించారు. నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించేందుకు అధికారులు అన్ని చర్యలూ తీసుకుంటున్నారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది విరామం లేకుండా పని చేస్తున్నారు. ఫిబ్రవరి 1 వరకూ మంచు తుపాను ప్రభావం చూపిస్తుందని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. మంచు తుపాను గురించి న్యూయార్క్ మేయర్ జోహ్రాన్ మమ్దానీ మాట్లాడుతూ నగరంలో గత ఎనిమిదేళ్లలో ఎన్నడూలేనంతగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని చెప్పారు. ఈ నెల 19 నుంచే 5 వేల మందికి పైగా నిరాశ్రయలకు ఆశ్రయం కల్పిస్తున్నామని చెప్పారు. భోజనం, దుస్తులు, అవసరమైన ఔషధాలు సమకూరుస్తున్నట్లు తెలిపారు.

# తొలిరోజు 902 నామినేషన్లు..

**కాంగ్రెస్ 382, బీఆర్ఎస్ 258, బీజేపీ నుంచి 169 దాఖలు**




**హైదరాబాద్,**

రాష్ట్రంలో పురపాలక ఎన్నికల నగారా మోగడంతో తొలిరోజే నామినేషన్ల పర్వం ఊపందుకున్నది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ) 2026 మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్‌ను బుధవారం విడుదల చేసిన నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా వివిధ పార్టీల నుంచి 902 నామినేషన్లు దాఖలయ్యాయి. అత్యధికంగా కాంగ్రెస్ నుంచి 382, బీఆర్ఎస్ నుంచి 258, బీజేపీ నుంచి 169, సీపీఎం నుంచి 8, బీఎస్పీ నుంచి 7, ఆప్ నుంచి ఒకటి, ఎంఐఎం నుంచి మూడు, ఇతర గుర్తింపు పొందిన పార్టీల నుంచి 19, స్వతంత్ర అభ్యర్థులు 55 మంది నామినేషన్లు దాఖలు చేశారు.

**ఎస్ఈసీ మార్గదర్శకాలు**

మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ల ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులు నామినేషన్లు సమర్పించే సమయంలో పాటించాల్సిన మార్గదర్శకాలను ఎస్ఈసీ విడుదల చేసింది. మున్సిపాలిటీల్లో జనరల్ అభ్యర్థులకు నామినేషన్ ఫీజు 2,500, ఎస్సీ/ఎస్టీ/బీసీ అభ్యర్థులకు రూ.1,250 గా నిర్ణయించారు. కార్పొరేషన్లలో ఇది వరుసగా రూ.5,000, 2,500గా పేర్కొన్నారు. మున్సిపాలిటీ వార్డు సభ్యుడు రూ.1,00,000 వరకు ప్రచారానికి ఖర్చు చేసేందుకు అనుమతి ఉన్నది.

# వికసిత్ భారత్ వైపు దేశం పయనిస్తోంది

మొదటి తరువాయి

అక్వా, పాల ఉత్పత్తుల్లో భారత్ ముందంజలో ఉందని రాష్ట్రపతి వెల్లడించారు. దేశంలో స్పేస్ టూరిజం అభివృద్ధికి ఎన్నో అవకాశాలున్నాయని రాష్ట్రపతి అన్నారు. భవిష్యత్‌లో అంతరిక్షంలో భారత స్పేస్ స్టేషన్ ఏర్పాటు చేస్తామని, జమ్మూకశ్మీర్‌లో అత్యంత ఎత్తైన రైల్వే బ్రిడ్జి నిర్మించామని గుర్తు చేశారు. గత 11 ఏళ్లలో భారత ఆర్థిక వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందిందని రాష్ట్రపతి చెప్పారు. అవినీతి కట్టడితో ప్రభుత్వ ప్రజాధనాన్ని సద్వినియోగం చేస్తోంది. జిఎస్‌టి స్లాబ్‌ల తగ్గింపుతో దేశ ప్రజల కొనుగోలు శక్తి పెరిగింది. యూరోపియన్ యూనియన్‌తో ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ చేసుకున్నాం. రూ.12లక్షల వార్షిక ఆదాయం వరకు ఆదాయపు పన్ను లేకుండా చేశాం. స్మార్ట్‌ఫోన్ల ఎగుమతుల్లోనూ భారత్ దూసుకెళ్తోంది. భారత్ పవర్ టెక్నాలజీ హబ్‌గా రూపొందుతోంది. గ్రీన్ ఎనర్జీ రంగంలో భారత్‌ను పవర్ హౌస్‌గా తయారు చేస్తున్నాం. భవిష్యత్‌లో 100 గిగావాట్ల న్యూక్లియర్ ఎనర్జీ ఉత్పత్తి లక్ష్యం. 500 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తికి చర్యలు. వికసిత్ భారత్‌లో రైతుకు అధిక ప్రాధాన్యత ఉంటుందని రాష్ట్రపతి స్పష్టం చేశారు. గ్రామీణ ఉపాధి కల్పన కోసం జీ రామ్ జీ చట్టం తీసుకొచ్చాం. దేశాభివృద్ధిలో మహిళలకు కీలక పాత్ర కల్పించాం. ఆపరేషన్ సిందూర్.. మన సైనికుల సత్తా చాటింది. భారత్‌పై దాడిచేస్తే ఏం జరుగుతుందో ప్రపంచం చూసింది. రక్షణరంగ ఉత్పత్తుల ఎగుమతి రికార్డు స్థాయిలో పెరిగింది. ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్ డిఫెన్స్ ఉత్పత్తులకు గిరాకీ పెరిగింది. నానో చిప్‌ల తయారీపైనా భారత్ దృష్టి సారించింది. మైక్రో చిప్‌ల తయారీలో స్వయంసమృద్ధి సాధించాలి. ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలో 15లక్షల ఉద్యోగాలు సృష్టించగలిగాం. ముద్ర యోజన ద్వారా చిరువ్యాపారులకు భారీగా రుణాలు అందించాం. వంటి ఎన్నో ప్రభుత్వ కార్యక్రమాల్ని రాష్ట్రపతి తన ప్రసంగంలో వెల్లడించారు. పీఎం విశ్వకర్మ యోజనతో 20లక్షల మందికి శిక్షణ ఇస్తున్నామని రాష్ట్రపతి తెలిపారు. ఎన్డీఏ పదేళ్ల పాలనలో 25 కోట్ల మందికి పేదరికం నుంచి విముక్తి కల్పించినట్లు తెలిపారు. 100 కోట్లకు పైగా గ్యాస్ కనెక్షన్లు అందించామని.. ఆయుష్మాన్ భారత్ ద్వారా కోట్ల మందికి వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. వికసిత్ భారత్‌లో రైతులకు ప్రథమ ప్రాధాన్యం ఇచ్చామన్నారు. వ్యవసాయ మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తున్నట్లు పేర్కొన్నారు. ఆత్మనిర్భర్ భారత్ సాధన కోసం కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్రపతి పేర్కొన్నారు. భవిష్యత్తును దృష్టిలోపెట్టుకొని దేశం సంస్కరణల పథంలో దూసుకెళ్తోందన్నారు. పీఎల్ఐ పథకం కింద పారిశ్రామికోత్పత్తిని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల్లో గణనీయమైన ప్రగతి సాధించామన్నారు. సముద్ర వ్యాపారాన్ని మరింత పెంచేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు వెల్లడించారు.


అంతకుముందు పార్లమెంట్‌కు చేరిన రాష్ట్రపతికి స్పీకర్ ఓం బిర్లా, ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, ప్రధాని మోడీ తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. ఆమెను సాదరంగా పార్లమెంట్ భవనంలోకి తోడ్కొనివెళ్లారు.

# కరీంనగర్ కార్పొరేషన్ లో కాంగ్రెస్ జెండా ఎగరాలి

మొదటి తరువాయి

ఈ సమావేశంలో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు పొన్నం ప్రభాకర్. ప్రజా పాలన ప్రభుత్వం లో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో గ్రామాల వలె పట్టణాల అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక తో ముందుకు పోతున్నామని అన్నారు. ఇప్పటికే పట్టణాల్లో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని... రాష్ట్రంలో ఎక్కడికెళ్లినా ప్రజా పాలనపై ప్రజలు పాజిటివ్ గా ఉన్నారని.. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రజల్లో వివరిస్తూ పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని అన్నారు. ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించామని.. ఇప్పటి వరకు ప్రభుత్వం ఆర్టీసీకి 9 వేల కోట్లు చెల్లించిందని అన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్,సన్న బియ్యం పంపిణీ,నూతన రేషన్ కార్డులు పంపిణీ, రైతులకు రైతు భరోసా, రైతు రుణమాఫీ,ఉద్యోగాల నియామకాలు , సన్న వడ్లు బోనస్, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, నియోజకవర్గనికి 3, 500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు, లాంటి ఎన్నో పథకాలు అమలు చేస్తుందని అన్నారు. పోటీ చేసే ఆశావహులు వార్డుల్లో తిరుగుతూ బలోపేతం చేయాలని..టికెట్ ఎవరికి వచ్చినా..అందరూ కలిసి సమన్వయం చేసుకుంటూ గెలవాలని అన్నారు రాజకీయాల్లో విశేష అనుభవం ఉన్న తుమ్మల నాగేశ్వరరావు కరీంనగర్ ఇంచార్జి గా ఉన్నారని..సెలెక్ట్ ఎలెక్ట్ ద్వారా మీకు మీరే వార్డుల్లో అభ్యర్థులను ఎంపిక చేసుకోవాలని అన్నారు. కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ కైవసం చేసుకునేలా కృషి చేయాలని పొన్నం ప్రభాకర్ అన్నారు .

# చర్మ వ్యాధులపై నిర్లక్ష్యం ప్రమాదకరం






మన శరీరంలో అతిపెద్ద అవయవం చర్మం. ఇది కేవలం అందాన్ని మాత్రమే కాకుండా శరీరాన్ని రోగకారక సూక్ష్మజీవులు, కాలుష్యం, ఎండ వేడి నుంచి రక్షించే కవచం. ఆధునిక జీవనశైలి, ఆహార అలవాట్లు, మానసిక ఒత్తిడి, రసాయనాల వినియోగం పెరగడంతో నేడు చర్మ సమస్యలు అన్ని వయస్సుల వారిలో విస్తృతంగా కనిపిస్తున్నాయి. చాలా మంది చర్మ సమస్యలను తాత్కాలికమైనవిగా భావించి నిర్లక్ష్యం చేస్తారు. కానీ ఇవి భవిష్యత్తులో దీర్ఘకాలిక వ్యాధులుగా మారే ప్రమాదం ఉంది. శుభ్రత లోపం, కాలుష్యం, రసాయనాల వినియోగం, ఆహార లోపాలు, హార్మోన్ల అసమతుల్యత, మానసిక ఒత్తిడి, వంశపారంపర్య ప్రభావం, రోగనిరోధక శక్తి తగ్గడం, మధుమేహం వంటి దీర్ఘ వ్యాధులు చర్మ సమస్యలకు ప్రధాన కారణాలుగా వైద్యులు చెబుతున్నారు. ఫంగల్ ఇన్ఫెక్షన్లు, ఎగ్జిమా, సోరియాసిస్, మొటిమలు, అలర్జీలు, పిగ్మెంటేషన్ వంటి వ్యాధులు సాధారణంగా కనిపిస్తాయి. దురద, మంట, చర్మం రంగు మారడం, పొట్టు పడటం, పుండ్లు, వాపు వంటి లక్షణాలు కనిపించినప్పుడు నిర్లక్ష్యం చేయరాదు. చర్మాన్ని శుభ్రంగా ఉంచుకోవడం, చెమట పట్టే చోట్ల పొడిగా ఉంచుకోవడం, పత్తి దుస్తులు ధరించడం, పండ్లుకూరగాయలు అధికంగా తీసుకోవడం, నీరు ఎక్కువగా తాగడం, సరైన నిద్ర తీసుకోవడం వంటి అలవాట్లు సమస్యలను తగ్గిస్తాయి. వైద్యుల సూచనలతో మాత్రమే మందులు వాడాలని నిపుణులు సూచిస్తున్నారు. స్టెరాయిడ్ క్రీములు స్వయంగా వాడటం, ఇతరుల దుస్తులు ఉపయోగించడం, సోషల్ మీడియా చిట్కాలను అంధంగా నమ్మడం వంటి పనులు చేయరాదు. చర్మ వ్యాధుల చికిత్స కేవలం బయట క్రీములతోనే కాకుండా లోపలి కారణాలను సరిచేయడం అవసరం. దీర్ఘకాలిక సమస్యలకు వైద్యుల సలహా తీసుకోవడం అత్యవసరం. చర్మ సమస్యలు వ్యక్తి ఆత్మవిశ్వాసాన్ని కూడా ప్రభావితం చేస్తాయి. కాబట్టి ప్రారంభ దశలోనే సరైన చికిత్స తీసుకోవడం ద్వారా పూర్తి ఆరోగ్యం సాధ్యమవుతుంది.

వ్యాసకర్త
**డాక్టర్. వాస సింధుజా**



# నిబంధనల ప్రకారం నామినేషన్ ప్రక్రియ

## కలెక్టర్ పమేలా సత్పతి

**కరీంనగర్, జనవరి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

జమ్మికుంటలో మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల స్వీకరణను ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. బుధవారం ఆమె హుజురాబాద్, జమ్మికుంట మున్సిపల్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను సందర్శించి, ఫారాలు, రిజిస్టర్లు పరిశీలించారు. ఆయా వార్డులకు దాఖలైన నామినేషన్ల వివరాలను తెలుసుకున్నారు. నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీ, అప్పీళ్ల పరిష్కారం, గుర్తుల కేటాయింపు, అభ్యర్థుల ప్రకటన వంటి ప్రక్రియలు పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. దాఖలైన నామినేషన్ల వివరాలను జాగ్రత్తగా పరిశీలించి, వెంటనే టీ.పోల్ యాప్‌లో అప్లోడ్ చేయాలని ఆదేశించారు. అభ్యర్థులు పూర్తి వివరాలతో నామినేషన్ పత్రాలు దాఖలు చేసేలా హెల్ప్‌డెస్క్ ద్వారా అవగాహన కల్పించాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో ఎన్నికల సిబ్బంది పనితీరును పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ నెల 30 వరకు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరించనున్నట్లు తెలిపారు. నామినేషన్ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించేందుకు అవసరమైన సిబ్బందిని నియమించామని, ఎన్నికలను పారదర్శకంగా నిర్వహిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్శనలో జమ్మికుంట మున్సిపల్ కమిషనర్ ఎండి. ఆయాజ్, హుజురాబాద్ మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసబ్ అహ్మద్ పాల్గొన్నారు.



# సూరపూర్ గ్రామంలో అభివృద్ధి పనులకు శ్రీకారం



**లింగాల, జనవరి 28(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

లింగాల మండల పరిధిలోని సూరపూర్ గ్రామంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు, తమిళనాడు రాష్ట్ర ఎఐసిసి పరిశీలకులు, జిల్లా డిసిసి అధ్యక్షులు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రంగినేని శ్రీనివాస్‌రావుతో కలిసి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గ్రామంలో స్థానిక ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ విద్యార్థుల విద్యా ప్రమాణాలను, మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు. ఉపాధ్యాయులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం నూతనంగా నిర్మించనున్న బస్సు షెల్టర్‌కు భూమి పూజ చేసి, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించి, పార్టీ కార్యకర్తలతో కలిసి పార్టీ బలోపేతంపై చర్చించారు. ప్రజల చెంతకు పాలన, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యమని ఎమ్మెల్యే వంశీకృష్ణ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కొత్త నాగేశ్వరరావు, గ్రామ సర్పంచ్ శేఖర్, మన్దంపూర్ ఉప సర్పంచ్ రవి, వెంకటేష్, తిరుపతయ్య, గబ్బురు స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# లేబర్ సెల్ అధ్యక్షుడిగా కిస్టాపురం హరేందర్ గౌడ్



**మొయినాబాద్, జనవరి 28(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

మొయినాబాద్ మండలం చందానగర్ గ్రామానికి చెందిన కిస్టాపురం హరేందర్ గౌడ్‌ను తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ లేబర్ సెల్ మొయినాబాద్ అధ్యక్షుడిగా నియమించారు. హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు జ్యోతి, రాష్ట్ర లేబర్ విభాగం అధ్యక్షుడు ప్రకాశ్ గౌడ్, మొయినాబాద్ మహిళా విభాగం అధ్యక్షురాలు కావ్య చేతుల మీదుగా ఆయన నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా హరేందర్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా గిద్వర్కర్ సమస్యలపై త్వరలో భారీ పోరాటం చేపడతామని, రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. బీమ్ భారత్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మొయినాబాద్ పురపాలక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు.

# నామినేషన్ల స్వీకరణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

## కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి, జనవరి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల స్వీకరణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేసినట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. బుధవారం ఆయన పెద్దపల్లి మున్సిపల్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను పరిశీలించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అర్బన్ లోకల్ బాడీస్ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. జిల్లాలోని మూడు మున్సిపాలిటీలు, రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చిందని తెలిపారు. జనవరి 30 వరకు నామినేషన్లు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ మున్సిపాలిటీలలో మున్సిపల్ కార్యాలయాల్లో నామినేషన్లు స్వీకరిస్తున్నామని, రామగుండం నగరపాలక సంస్థకు సంబంధించి ఎనిమిది సెంటర్లను ఏర్పాటు చేశామని వివరించారు. జిల్లాలోని 124 వార్డుల పరిధిలో 62 రిటర్నింగ్ అధికారులు, 62 అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను నియమించినట్లు తెలిపారు. నామినేషన్ల స్వీకరణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేసినట్లు కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ పర్యటనలో ఎలక్షన్ అబ్జర్వర్లు పద్మజ రాణి, సుజాత, మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణ జాగృతి మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా కొలిపక శ్రీనివాస్



**పెద్దపల్లి, ,జనవరి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా కొలిపక శ్రీనివాస్‌ను ప్రకటించినట్లు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తెలిపారు. ఆయనకు సింహం గుర్తు కేటాయించామని స్పష్టం చేశారు. కవిత మాట్లాడుతూ, పెద్దపల్లి ప్రజల ఆకాంక్షలకు ప్రతిబింబంగా నిలిచే నాయకుడు శ్రీనివాస్ ప్రజల మధ్య నుంచి వచ్చిన వ్యక్తి అని, మున్సిపల్ పాలనలో పారదర్శకత, సమానత్వం, అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లగల సామర్థ్యం ఆయనకు ఉందని పేర్కొన్నారు. తెలంగాణ జాగృతి సిద్ధాంతాలకు అనుగుణంగా సింహం గుర్తుపై పోటీ చేస్తున్న శ్రీనివాస్‌ను ప్రజలు ఘన విజయం దిశగా నడిపిస్తారని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు. రాష్ట్ర కార్యదర్శి బండారి శ్రీనివాస్ మాట్లాడుతూ, పెద్దపల్లి మున్సిపాలిటీలో మార్పు, ప్రజాపాలన, అభివృద్ధి కోసం తెలంగాణ జాగృతి కట్టుబడి ఉందని, రాబోయే ఎన్నికల్లో సింహం గుర్తు ప్రజల నమ్మకానికి ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. పట్టణ అభివృద్ధి, పేదల సంక్షేమం, యువతకు అవకాశాలు, మహిళల భద్రత వంటి అంశాలపై శ్రీనివాస్ నాయకత్వంలో బలమైన ప్రజా పాలన ఏర్పాటు చేయడమే లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కొలిపాక సంపత్, గంగుల సతీష్, సంతోష్, నరేష్, చందు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎస్‌జిటియు డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ




**గంగాధర ,జనవరి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం రామడుగు మండలంలో సెకండరీ గ్రేడ్ టీచర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఎస్‌జిటియు డైరీ మరియు జిల్లా శాఖ క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని మండల విద్యాధికారి జిపివి రంగనాథ శర్మ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్‌జిటియు జిల్లా అధ్యక్షుడు ఊకంటి విజయేందర్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి దేవిశెట్టి ఆంజనేయులు, జిల్లా కార్యదర్శి వెంకటేశ్వరరావు, మండల బాధ్యులు రవీందర్రావు పాల్గొన్నారు. అదేవిధంగా పీ ఆర్ టి యు ప్రతినిధులు శ్రీనివాసరెడ్డి, సత్యనారాయణ రెడ్డి, టి టి యు మండల అధ్యక్షుడు మిట్టపల్లి రవీందర్, ఉపాధ్యాయులు రత్నాకర్ రెడ్డి తదితరులు హాజరయ్యారు.

# అభివృద్ధి కోసం మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించండి



**కరీంనగర్, జనవరి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

జమ్మికుంట మున్సిపాలిటీని బిజెపికి అప్పగిస్తే పట్టణ రూపురేఖలు మారుస్తామని జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. పట్టణ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్ ర్యాలీలో ఆయన మాట్లాడుతూ గత బిఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు మున్సిపాలిటీల అభివృద్ధి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించాయని, జరగబోయే ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కృషితో జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల మైదానంలో రూ. 6.5 కోట్లతో అత్యాధునిక సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్ నిర్మాణం జరగనుందని, ఇది ఉత్తర తెలంగాణ క్రీడాకారులకు అంతర్జాతీయ స్థాయి శిక్షణ అందించే వరమని ఆయన పేర్కొన్నారు. పట్టణ అభివృద్ధి, రైల్వే స్టేషన్ అభివృద్ధి కోసం కేంద్రం కృషి చేస్తోందని, మున్సిపాలిటీల అభివృద్ధి కేవలం బిజెపితోనే సాధ్యమని ధీమా వ్యక్తం చేశారు. జమ్మికుంట ప్రజల దీవెనలతో మున్సిపాలిటీలో కాషాయ జెండా ఎగరవేయడం ఖాయమని ఆయన అన్నారు.


# మున్సిపల్ ఎన్నికల సన్నాహక కాంగ్రెస్ పార్టీ సమావేశం



**హుస్నాబాద్ ,జనవరి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

హుస్నాబాద్ కేజీఆర్ గార్డెన్స్‌లో మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశం ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా కరీంనగర్ జిల్లా ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్, బీజేపీ నుండి వందలాది మంది నేతలు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. మాజీ మున్సిపల్ చైర్మన్ ఆకుల రజిత వెంకన్న, వైస్ చైర్మన్ అయిలేని అనితారెడ్డి సహా పలువురు నేతలకు మంత్రులు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కోహెడ మండలం నారాయణపూర్ గ్రామ సర్పంచ్ హరిపుష్పలత అశోక్, బత్తులవాని గ్రామ సర్పంచ్ బత్తుల రాములు, పరివేద గ్రామ ఉప సర్పంచ్ పొన్నం బాలయ్యతో పాటు బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఖాతా వినయ్, బీఎస్పీ మండల అధ్యక్షుడు ఖాతా శ్రీకాంత్, ఇతర నేతలు అందే శ్రీనివాస్, అందే రాజేష్, పొన్న రాజయ్య, సాయిని బాలమల్లు, సాధనవేణి బాలయ్య తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి, హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి, కోహెడ మార్కెట్ కమిటీ చైర్మన్ నిర్మలా జయరాజ్, సైదాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్, ఎలకతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ సంతాజి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, ఇతర నేతలు పాల్గొన్నారు.

## గద్దెకు చేరుకున్న
# సారలమ్మ తల్లి



**పాలకుర్తి ,జనవరి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

: పాలకుర్తి మండలం ఈశాల తక్కల్లపల్లి గ్రామంలో బుధవారం వనదేవత సారలమ్మ తల్లి గద్దెకు చేరుకుంది. కోట్లాది భక్తుల కోరికలు తీర్చే సమ్మక్కసారలమ్మ దేవతల ప్రతిష్ట సమయం ఆసన్నమవడంతో కోయ పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల జయజయధ్వానాలు, పునాకాల మధ్య సారలమ్మను గద్దెపై ప్రతిష్టించారు. పాలకుర్తి మండలంలో అతి పెద్ద జాతరగా పేరుగాంచిన ఈశాల తక్కల్లపల్లి జాతర వైపు దారులన్నీ భక్తుల రాకతో కిటకిటలాడుతున్నాయి. ఆలయ ప్రాంగణం విద్యుత్ దీపాల కాంతులతో శోభాయమానమైంది. భక్తులు తమ స్థావరాలకు చేరుకుని శుక్రవారం సమ్మక్క తల్లి రాక కోసం ఎదురుచూస్తున్నారు. వనదేవతలు వచ్చే సమయంలో తొక్కిసలాటలు జరగకుండా క్యూ లైన్ల వద్ద పోలీసులు, వాలంటీర్లు అప్రమత్తంగా ఉన్నారు. సుమారు లక్షకు పైగా భక్తులు అమ్మవార్లను దర్శించుకుంటారని కమిటీ సభ్యులు తెలిపారు.

# ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి




**పెద్దపల్లి,జనవరి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నిరుద్యోగ యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసం కరీంనగర్ అంబేద్కర్ స్టడీ సర్కిల్ అందించే ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని డైరెక్టర్ బండ శ్రీనివాస్ సూచించారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న స్టడీ సర్కిల్ కరీంనగర్ బ్రాంచ్‌లో స్టేట్, సెంట్రల్ సర్వీసులు, బ్యాంకింగ్, రైల్వే, స్టాఫ్ సెలక్షన్ ఉద్యోగాలకు ఐదు నెలల ఫౌండేషన్ కోర్స్ అందిస్తున్నామని తెలిపారు. 100 మందికి ఉచిత భోజన, వసతి సౌకర్యాలతో శిక్షణ కల్పిస్తామని చెప్పారు. గతంలో 928 మందికి శిక్షణ ఇచ్చి, అందులో 308 మంది ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారని వివరించారు. పెద్దపల్లి జిల్లాకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల అభ్యర్థులు వార్షిక ఆదాయం 3 లక్షలలోపు ఉంటే జనవరి 30లోగా స్టడీ సర్కిల్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఎలాంటి ఫీజు లేకుండా అప్లై చేసుకునే సమయంలో ఎస్ఎస్‌సి, డిగ్రీ ప్రొవిజనల్, మార్కుల మెమో, కులం, ఆదాయం సర్టిఫికెట్, ఆధార్ కార్డు అవసరమని చెప్పారు. ఫిబ్రవరి 8న కరీంనగర్‌లో జరిగే ప్రవేశ పరీక్ష ద్వారా 100 మందిని ఎంపిక చేస్తారని, రిజర్వేషన్ ప్రకారం ఎస్సీలకు 75%, ఎస్టీలకు 10%, బీసీలకు 15% సీట్లు కేటాయిస్తామని, మహిళలకు 33%, దివ్యాంగులకు 5% సీట్లు ఉంటాయని తెలిపారు. మరిన్ని వివరాలకు 9885218053లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

# ఎన్నికల కేంద్రాలను తనిఖీ చేసిన సిపి గౌష్ ఆలం



**కరీంనగర్ జనవరి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

హుజురాబాద్, జమ్మికుంట మున్సిపాలిటీల్లో జరగనున్న రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం బుధవారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఎన్నికల నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. హుజురాబాద్, జమ్మికుంట పురపాలక సంఘ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను సందర్శించి భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. హుజురాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, జమ్మికుంట డిగ్రీ, పీజీ కళాశాలల్లో ఏర్పాటు చేయబోయే కౌంటింగ్ కేంద్రాలు, బ్యాలెట్ బాక్సుల భద్రత కోసం కేటాయించిన స్ట్రాంగ్ రూమ్‌లను కూడా ఆయన తనిఖీ చేశారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. కేంద్రాల వద్ద నిరంతరం నిఘా ఉంచాలని, బందోబస్తు విషయంలో ఎటువంటి అలసత్వం వహించకూడదని ఆదేశించారు. ఈ పర్యటనలో ఏసీపీ మాధవి, జమ్మికుంట ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, హుజురాబాద్ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సమ్మక్క సారలమ్మ జాతర ఏర్పాట్లను పరిశీలన

**- సీఐ ప్రవీణ్ కుమార్**



**పాలకుర్తి ,జనవరి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

పాలకుర్తి మండలం ఈశాల తక్కల్లపల్లి గ్రామంలో జరిగే శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర వద్ద భద్రతా ఏర్పాట్లను పెద్దపల్లి సీఐ ప్రవీణ్ కుమార్ బుధవారం పరిశీలించారు. భక్తుల రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉన్నందున నేర నియంత్రణ కోసం దేవస్థాన ప్రాంగణంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆలయ కమిటీకి సూచించారు. జాతర ప్రాంగణంలో భక్తుల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనాలను మితిమీరిన వేగంతో నడపరాదని, కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకుని ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని బసంతనగర్ ఎస్ఐ నూతి శ్రీధర్‌ను ఆదేశించారు.

# నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే



**గంగాధర ,జనవరి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

కరీంనగర్ జిల్లా చొప్పదండి మున్సిపాలిటీల్లో జరుగుతున్న నామినేషన్ల ప్రక్రియను అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే బుధవారం పరిశీలించారు. నామినేషన్ల స్వీకరణ కేంద్రాల్లో ఏర్పాట్లను పర్యవేక్షించి, అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. హెల్ప్‌డెస్క్ వద్ద అభ్యర్థుల సందేహాలను నివృత్తి చేయాలని సూచించిన ఆమె, ఎన్నికల నిబంధనలను ఖచ్చితంగా అమలు చేసి ప్రశాంత వాతావరణంలో నామినేషన్ల ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని అన్నారు. దాఖలైన నామినేషన్ల వివరాలను జాగ్రత్తగా పరిశీలించి వెంటనే టీ.పోల్ యాప్‌లో అప్లోడ్ చేయాలని ఆదేశించారు. చొప్పదండి మున్సిపల్ పరిధిలోని వార్డు స్థానాలకు దాఖలైన నామినేషన్ వివరాలను ఎన్నికల సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

# జెడ్‌పిహెచ్‌ఎస్ పాఠశాలలో స్నేహిత ఫేస్2 అవగాహన సదస్సు




**రామడుగు, జనవరి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

గోపాలరావుపేట జెడ్‌పి హెచ్ఎస్ పాఠశాలలో స్నేహిత ఫేస్2 కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల భద్రత, పిల్లల సంరక్షణ, స్వీయ రక్షణ, సోషల్ మీడియా భద్రత, పోక్స్ చట్టం, చైల్డ్ హెల్ప్‌లైన్ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కాడే చంద్రశేఖర్, ఐసిడిఎస్ కవితా దేవి, డాక్టర్ అరుణ, హెల్త్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు, ఫ్రెండ్లీ టీచర్ మంజుల, మండల విద్యాధికారి రంగనాథ శర్మతో పాటు పలువురు పాల్గొన్నారు.

## సర్వేను వేగవంతంగా పూర్తి చేయండి: ఎంపీడీవో

**ఆళ్లగడ్డ జనవరి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

ఆళ్లగడ్డ మండల పరిధిలోని జి.జంబులదిన్నె, ఓబులంపల్లె గ్రామ సచివాలయాలను ఎంపీడీవో నూర్జహాన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది హాజరు పట్టికను ఆమె పరిశీలించి, విధుల పట్ల నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. గ్రామాలలో కొనసాగుతున్న యూనిటెడ్ ఫ్యామిలీ సర్వే పురోగతిని సమీక్షించారు. సర్వే పనులను నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

## బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ హక్కుల పరిరక్షణ తెలంగాణ రాజ్యాధికార పార్టీ లక్ష్యం

**వట్టే జానయ్య యాదవ్ తెలంగాణ రాజ్యాధికార పార్టీ ప్రధాన కార్యదర్శి**



**నల్లగొండ ,జనవరి 28 (నీలగిరి ఎక్స్ ప్రెస్);**
తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్ సమక్షంలో పార్టీలో చేరిన నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు వార్డుల యువకులు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న నేతృత్వంలో మెజార్టీ ప్రజల పక్షాన రాజకీయ పోరాటం కొనసాగిస్తాం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల హక్కుల పరిరక్షణే లక్ష్యంగా మున్సిపల్ ఎన్నికల్లో తెలంగాణ రాజ్యాధికార పార్టీ పోటీ చేస్తుందని 78 ఏళ్లుగా మెజార్టీ ప్రజలపై కొద్దిమంది వర్గాల ఆధిపత్యం కొనసాగిందని విమర్శించారు
ఈసారి కత్తెర గుర్తుపై పోటీ చేస్తున్న సబ్బండ వర్గాల అభ్యర్థులను ఆదరించాలని ప్రజలకు పిలుపునిచ్చారు బిఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు బీసీలకు మోసం చేశాయని అభివృద్ధి పేరుతో అగ్రవర్ణాల దోపిడి కొనసాగుతుందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 48 వార్డుల్లో పార్టీ అభ్యర్థులు బరిలో ఉంటారని ప్రకటించారు అగ్రవర్ణ పార్టీలను రాజకీయంగా పాతర వేసేందుకు యువత పెద్ద ఎత్తున పార్టీలో చేరుతున్నారని వెల్లడించారు 2028 శాసనసభ ఎన్నికల్లో బీసీ ముఖ్యమంత్రి అవుతారని ధీమా వ్యక్తంచేశారు.

## తిప్పర్తి మోడల్ స్కూల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం ప్రిన్సిపాల్ ఏ అపర్ణ



**నల్లగొండ ,జనవరి 28 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
నల్లగొండ జిల్లా తిప్పర్తి మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ లో 2026-27 విద్యా సంవత్సరానికి గాను ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఏ అపర్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆరో తరగతిలో 100 సీట్లకు కొత్త ప్రవేశాలతో పాటు, ఏడవ తరగతి నుండి పదో తరగతి వరకు వివిధ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి అర్హులైన విద్యార్థులు తెలంగాణ మోడల్ స్కూల్ అధికారిక వెబ్ సైట్https://tgms.telangana.gov.in ద్వారా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు. దరఖాస్తుల స్వీకరణ జనవరి 28 నుండి ఫిబ్రవరి 28 వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్షను ఏప్రిల్ 19, 2026న నిర్వహిస్తామన్నారు. ఓసీ విద్యార్థులు 200 రూపాయలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ,వెనుకబడిన వర్గాలు, దివ్యాంగ విద్యార్థులు 125 రూపాయలు రుసుము చెల్లించాలని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు. మరింత సమాచారం కోసం ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకోవచ్చని లేదా నేరుగా పాఠశాలను సంప్రదించవచ్చని తెలిపారు తెలిపారు.

## కూరాకుల రవీంద్రనాథ్‌కు ఘన సన్మానం



**మిర్యాలగూడ, జనవరి 28(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
విజయవాడలో జరిగిన సౌత్ ఇండియా ఫిలిం ఆర్టిస్ట్ అసోసియేషన్ సమావేశంలో కూరాకుల రవీంద్రనాథ్‌ను సిఫా జనరల్ సెక్రటరీగా ప్రకటించారు. ఈ సందర్భంగా అడవిదేవులపల్లి భజన మండలి సభ్యులు మండల సైదులు, బండి పకీరయ్య, పసుపులేటి ఆంజనేయులు కలిసి ఆయనకు సన్మానం చేశారు. కూరాకుల రవీంద్రనాథ్ మరిన్ని ఉన్నత శిఖరాలకు ఎదిగి మంచి సినిమాల్లో అవకాశాలు పొందాలని, గ్రామానికి జిల్లాకు పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భజన బృందం సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

# ఉనికి కోసం పాకులాడుతున్న మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు




**అమ్రాబాద్, జనవరి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు చేసిన వ్యాఖ్యలపై అమ్రాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం జరిగింది. కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, బాలరాజు పదేళ్లు ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ పార్టీకి ద్రోహం చేసి బీజేపీలో చేరారని, గతంలో టీఆర్ఎస్ ప్రభుత్వంలో ఉన్నప్పుడు బీజేపీపై చేసిన విమర్శలను మర్చిపోయి ఇప్పుడు అదే పార్టీలో కొనసాగడం విడ్డూరమని అన్నారు. డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణపై బాలరాజు అసభ్య పదజాలం ఉపయోగించడం అచ్చంపేట ప్రజలను ఆశ్చర్యానికి గురి చేసిందని, గతంలో గుప్తనిధుల వ్యవహారాల్లో ఆయన పాత్ర ఉందని ఆరోపించారు. వంశీకృష్ణ కుటుంబం నక్సలైట్ల దాడిలో నష్టపోయిన సందర్భాన్ని గుర్తుచేసి, అలాంటి నాయకుడిపై బాలరాజు విమర్శలు చేయడం తగదని మండల కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు. బాలరాజు చేసిన వ్యాఖ్యలపై చట్టరీత్య చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొప్పుల హరినారాయణ, డిప్యూటీ సర్పంచ్ నోముల రాజారాం, కుందా మల్లికార్జున్, బి.లింగం, కృష్ణయ్య, జహంగీర్, అనిల్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే వంశీకృష్ణ సమక్షంలో రైతులకు స్ప్రింకర్ సెట్స్ పంపిణీ



**అమ్రాబాద్ ,జనవరి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అమ్రాబాద్ మండలం బికె తిరుమలాపూర్, బికె ఉప్పునుంతల గ్రామాలకు చెందిన హార్టికల్చర్ రైతులకు అచ్చంపేట ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో స్ప్రింకర్ సెట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రైతులందరికీ యాంత్రిక వ్యవసాయ ఉపకరణాలను అందజేస్తోందని తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా రైతులకు స్ప్రింకర్ సెట్స్, యాంత్రిక పరికరాలను ఇవ్వలేదని, ప్రస్తుత ప్రభుత్వం రోటవేటర్, కల్టివేటర్, పంపుసెట్లు, పిచికారి యంత్రాలు వంటి పరికరాలను రాయితీపై అందజేస్తోందని చెప్పారు. రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ వ్యవసాయాన్ని పండుగలా మార్చిన ఏకైక ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం అని ఆయన పేర్కొన్నారు. రుణమాఫీ, రైతు భరోసా, సన్నబట్లకు బోనస్ వంటి పథకాలు అమలవుతున్నాయని తెలిపారు. అచ్చంపేట మార్కెట్లో వేరుశనగ రైతులకు గిట్టుబాటు ధర లభించిందని, ప్రభుత్వం రైతులందరికీ గిట్టుధర కల్పిస్తుందని అన్నారు. రైతులు ఎమ్మెల్యేకు ఘన సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ ఏఈ కాశన్న, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపాల్ రెడ్డి, చ నాయక్, కోయల శ్రీనివాసులు, ఆదర్శ రైతు హనుమంతు, చెన్నకేశవులు, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# బడంగ్‌పేట్‌లో దోమల ముప్పు

**అధికారుల నిర్లక్ష్యంతో ప్రజల ఆరోగ్యానికి ప్రమాదం - నరేష్ దండు**



**బడంగ్‌పేట్, జనవరి 28(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
బడంగ్‌పేట్ నగర పంచాయతీ పరిధిలోని దాదాపు అన్ని కాలనీలు, బస్తీల్లో దోమల బాధ రోజురోజుకీ తీవ్రరూపం దాల్చుతోంది. ముఖ్యంగా నగర పంచాయతీ మారుమూల ప్రాంతాలైన ఆధిత్యనగర్, గుర్రంగూడ తదితర ప్రాంతాల్లో పరిస్థితి మరింత దారుణంగా మారింది. దోమల ఉధృతి కారణంగా ప్రజలు నిద్రలేని రాత్రులు గడుపుతుండగా, డెంగ్యూ, మలేరియా వంటి ప్రాణాంతక వ్యాధుల ముప్పు పెరుగుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై అనేకసార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ, ఇప్పటివరకు స్పష్టమైన చర్యలు తీసుకోకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారిందని విమర్శలు వినిపిస్తున్నాయి. నగర పంచాయతీ ప్రాపర్టీ ట్యాక్స్ వసూలుపై చూపుతున్న శ్రద్ధ, ప్రజల ప్రాథమిక ఆరోగ్య సమస్యలపై కనిపించడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దోమల నియంత్రణ కోసం వినియోగించే ఫాగింగ్ మిషన్లు పనిచేయడం లేదని అధికారులు, సిబ్బంది చెప్పడం మరింత ఆందోళన కలిగించే అంశంగా మారింది. ఇది పరిపాలనా వైఫల్యానికి స్పష్టమైన ఉదాహరణగా ప్రజలు భావిస్తున్నారు. ఈ విషయమై పర్యావరణ పరిరక్షణ సమితి చైర్మన్ నరేష్ దండు మాట్లాడుతూ, వెంటనే దోమల నియంత్రణ చర్యలు చేపట్టి, ఫాగింగ్, లార్వా నివారణ కార్యక్రమాలను యుద్ధప్రాతిపదికన అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే సంబంధిత అధికారుల నిర్లక్ష్యంపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికైనా నగర పంచాయతీ అధికారులు స్పందించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే దిశగా తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శ



**కడ్తాల్, జనవరి 28 ( నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణ రెడ్డి కడ్తాల్ మండలం చరికొండ గ్రామ పంచాయతీ చెందిన వల్లభుదాస్ వెంకటయ్య ప్రమాదవశాత్తు రాఘాయిపల్లి గేట్ వద్ద మృతి చెందిన విషయం తెలిసి కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో మార్చురీలో మృతదేహాన్ని పరిశీలించి,కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయనతో పాటుగా గ్రామ సర్పంచ్ మహేందర్ గౌడ్ మరియు వార్డ్ మెంబర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మైసిగండి మైసమ్మ దేవత హుండీ ఆదాయం రూ . 11 లక్షలు



**కడ్తాల్, జనవరి 28 ( నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కడ్తాల్ మండలంలోని మైసిగండి మైసమ్మ దేవత ఆలయంలోని హుండీనీ బుదవారం లెక్కించారు. సుమారు (59)రోజులకు గాను రూ, 11,03,556/- ( పదకొండు లక్షల మూడు వేల ఐదు వందల ఐదువందల యాభై ఆరు రూపాయలు) ఆదాయం లభించినట్లు ఈవో స్నేహలత తెలిపారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా దేవాదాయ శాఖ తూర్పువిభాగ ఇన్స్ పెక్టర్ ప్రణీత్, పౌండర్ ట్రష్టి లక్ష్మి శిరోళి, ఈ ఓ: స్నేహలత, సర్పంచ్ ప్రేమ జవహర్ లాల్ నాయక్, ఆర్ పి భాస్కర్, అరుణ్, ఉప ప్రధాన అర్చక మాదారం యాదగిరి, సిబ్బంది క్రిష్ణ, చంద్రయ్య, రాములు, శ్రీనివాసులు, పత్య నాయక్, హర్షవర్ధన్, వెంకటేష్, బీబీచారి, శ్రీను, అన్నపూర్ణ సేవా ట్రస్ట్, కెనరా బ్యాంకు సిబ్బంది లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

# ఐద్వా కేంద్ర కమిటీకి పాలడుగు ప్రభావతి ఎన్నిక

**నల్లగొండ జనవరి 28 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** 25 వ తేదీ నుండి 28వ తేదీ వరకు హైదరాబాదులో జరిగిన అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) 14వ జాతీయ మహాసభలల్లో కేంద్ర కమిటీకి సభ్యురాలుగా ఎన్నికైనట్లు పాలడుగు ప్రభావతి ఒక ప్రకటన ద్వారా తెలియజేసినారు. 1992 సంవత్సరంలో సాక్షరత ఉద్యమ ప్రభావంతో ప్రజల్లో చైతన్యం తేవడానికి నా వంతు ప్రయత్నం చేయాలని ఉద్దేశంతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో జరిగిన అక్షరాస్యత ఉద్యమంలో చురుకుగా పాల్గొని కళారూపాల ద్వారా ప్రజలకు చదువు అవసరం తెలియజేయడం జరిగిందని అన్నారు. తరువాత గ్రామీణ ప్రాంతాల్లో నూటికి 80% ఉన్న వ్యవసాయ కూలీల సమస్యలపైన పనిచేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘంలో చేరి కూలీ పోరాటాల ఉద్యమంలో విస్తృతంగా పాల్గొనడం జరిగిందని తెలిపారు. ఆ తర్వాత సమాజంలో సగభాగం ఉన్న స్త్రీలు దాడులు, దౌర్జన్యాలు, హత్యలు, అత్యాచారాలు, విద్యా, వైద్యంలో అన్ని రంగాలలో వివక్ష గురవుతున్న పరిస్థితి చూసి మహిళల సమస్యలపై పోరాడుతున్న అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) సంఘంలో చేరి వారు నిర్వహిస్తున్న అనేక ఉద్యమాల్లో పాలుపంచుకోవడం జరిగిందని తెలిపారు. గ్రామస్థాయి నుండి ప్రారంభమైన ఉద్యమ ప్రస్థానం మండల కార్యదర్శిగా, జిల్లా కార్యదర్శి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలుగా అవకాశం కల్పించిన ఐద్వా సంఘం నేడు హైదరాబాదులో జరిగిన జాతీయ మహాసభల్లో కేంద్ర కమిటీ సభ్యురాలిగా ఎన్నుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా



మహిళలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు ఇంకా పరిష్కారం కావలసి ఉన్నాయని ఉన్నారు. సమాజంలో నేటికీ పేదరికం, నిరక్షరాస్యత, నిరుద్యోగం, పర్యావరణ సంక్షోభం ఎదుర్కొంటుందని ఇవన్నీ మహిళలకు మరింత భారంగా మారాయని అన్నారు. మహిళలకు స్వంత ఆదాయం లేకపోవడం వల్ల కుటుంబ పరిస్థితుల్లో నిర్ణయ సామర్థ్యం తగ్గిపోతోందని తెలిపారు. నిరక్షరాస్యత ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో బాలికల విద్యపై నిర్లక్ష్యం కొనసాగుతోందని ఆవేదన వెలిబుచ్చారు. మహిళపై హింస, లైంగిక దాడులు, గృహ హింస, వేధింపులు, అత్యాచారాలు హత్యలు వంటి సమస్యలు రోజురోజుకు పెరుగుతున్నాయని అన్నారు. ప్రధానంగా మహిళలు ఆరోగ్యం, పోషకాహార సమస్యలు, ప్రసూతి ఆరోగ్యం, పౌష్టికాహార లోపం వంటి అంశాలు అవసరమైన ప్రాధాన్యం పొందడం లేదని అన్నారు. ఇవి పరిష్కారం కావాలంటే మహిళలకు చట్టసభలలో 33 శాతం రిజర్వేషన్ల అమలు చేయాలని అందుకు చట్టం కూడా చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినారు. పాలకులు మద్యం, మత్తు పదార్థాలు నిషేధించక పోవడం వల్ల నూటికి 90 శాతం మహిళలపై వీటి వల్ల దాడులు జరుగుతున్నాయని ఎప్పటికైనా ప్రభుత్వాలు చిత్తశుద్ధితో నిషేధించాలని కోరారు. సినిమాలలో అశ్లీలత, సోషల్ మీడియాలో విచ్చలవిడితనం అరికట్టాలని, మహిళలను వ్యాపార ఆట వస్తువులుగా ప్రకటనలు కూడా నిషేధించాలని సూచించారు. మహిళా కేసులు కోర్టులలో వేలాదిగా పెండింగులో ఉంటున్నవని ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసి త్వరితగతిన పరిష్కారం చూపి నిందితులకు శిక్షలు వేసే విధంగా ప్రయత్నం చేయాలని అన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని తిరిగి పునరుద్ధరించాలి విబిజీరామ్ చట్టాన్ని తొలగించాలి, కులం పేరా, మతం పేరా స్త్రీలను రెండవ పౌరురాలుగా చూస్తున్న మత ఉన్మాదుల నుండి మహిళలను రక్షించు కోవడానికి ప్రతి మహిళ పోరాడాలని అందుకు రానున్న కాలంలో అన్ని వర్గాల మహిళలను సమీకరించి మరిన్ని ఉద్యమాలు చేపడతామని ప్రభావతి తెలియజేశారు.

ఈ సందర్భంగా నల్లగొండ జిల్లా నుండి కేంద్ర కమిటీ ఎన్నికైనా పాలడుగు ప్రభావతికి జిల్లా, మండల, గ్రామస్థాయి మహిళా సంఘ నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు.


## కళాకారుల అభివృద్ధికి ప్రభుత్వ ప్రోత్సాహం ఎమ్మెల్యే శంకర్‌కు టార్జాన్ కృతజ్ఞతలు



**నందిగామ, జనవరి 28(నీలగిరి ఎక్స్ ప్రెస్)** షాద్‌నగర్ నియోజకవర్గ కళాకారుల అభివృద్ధి కోసం ప్రభుత్వం ద్వారా ఆడిటోరియం నిర్మాణానికి 4.38 కోట్ల రూపాయలు మంజూరైన సందర్భంగా టాలీవుడ్ సినీనటుడు టార్జాన్ (లక్ష్మీనారాయణ) ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను ప్రత్యేకంగా కలుసుకొని సన్మానించారు.నందిగామ మండలం అప్పారెడ్డిగూడ గ్రామంలో జరిగిన కార్యక్రమంలో టార్జాన్ శాలువా కప్పి జ్ఞాపికను అందజేస్తూ ఎమ్మెల్యే శంకర్ కృషికి కళాకారుల తరపున ధన్యవాదాలు తెలిపారు. కళాకారుల మనోభావాలను అర్థం చేసుకొని, ఆగిపోయిన కళాక్షేత్రాన్ని తిరిగి రూపుదిద్దుకునేలా చేసిన శంకర్ కృషి నిర్వచనాతీతమని ఆయన అభినందించారు.కళాకారుల సహకారం ఎల్లప్పుడూ ఎమ్మెల్యే వెంట ఉంటుందని, ఆయనకు మంచి ఆరోగ్యం, సుదీర్ఘ పరిపాలన కలగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా స్థానిక జర్నలిస్టులు కె.పి, హరీష్ కుమార్ శర్మ తదితరులను కూడా ఎమ్మెల్యే శంకర్ సన్మానించారు. కళాకారులకు అండగా ఉంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

## ఆలేరు మున్సిపాలిటీ పై బీజేపీ జెండా ఎగరాలి

- బీజేపీ రాష్ట్ర నాయకుడు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి



**ఆలేరు, జనవరి 28(నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఆలేరు పట్టణ అధ్యక్షుడు నంద గంగేష్ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ ఎన్నికల సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో యాదాద్రి భువనగిరి జిల్లా ఇంచార్జి, బీజేపీ రాష్ట్ర నాయకుడు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి పాల్గొని, ఆలేరు మున్సిపాలిటీలో ఈసారి తప్పనిసరిగా బీజేపీ జెండా ఎగరాలని పిలుపునిచ్చారు.పట్టణ అభివృద్ధి, అవినీతిరహిత పాలన, ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పాలనలో పట్టణం నిర్లక్ష్యానికి గురైందని, ప్రజలు మార్పు కోరుకుంటున్నారని విమర్శించారు.ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు అశోక్ గౌడ్, మున్సిపాలిటీ ఇంచార్జ్ వీరా రెడ్డి, అభ్యర్థి శ్రీనివాస్, సీనియర్ నాయకుడు వట్టిపల్లి శ్రీనివాస్‌తో పాటు జిల్లా మున్సిపాలిటీ నాయకులు పాల్గొన్నారు.ఆలేరు మున్సిపాలిటీలో బీజేపీ గెలుపు అనివార్యమని, ప్రతి బూత్‌పై పట్టు సాధించి అభ్యర్థుల విజయం కోసం అంకితభావంతో పనిచేయాలని నెల్లి శ్రీ వర్ధన్ రెడ్డి స్పష్టం చేశారు.

## పురపాలక సంఘ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రారంభం



**తూప్రాన్, జనవరి 28(నీలగిరి ఎక్స్ ప్రెస్)** : మెదక్ జిల్లా తూప్రాన్ పురపాలక సంఘ కార్యాలయంలో మున్సిపల్ 2వ సాధారణ ఎన్నికలలో భాగంగా బుధవారం పురపాలక సంఘ కార్యాలయం నందు 4 నామినేషన్లను స్వీకరించినట్లు తూప్రాన్ పురపాలక సంఘ కమిషనర్ గణేష్ రెడ్డి తెలిపారు. వాటిలో 2, 3వ వార్డుల నుండి కాంగ్రెస్ అభ్యర్థులు మరియు 10, 16వ వార్డుల నుండి బిజెపి తరపున పోటీ చేసే అభ్యర్థులు నుండి నామినేషన్ పత్రాలు వచ్చినట్టు వారు తెలిపారు.

## దండుపల్లి గ్రామంలో గ్రామ సభ



**మనోహరాబాద్, జనవరి 28(నీలగిరి ఎక్స్ ప్రెస్)** మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలంలోని దండుపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ మరాఠి నాగరాజు ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న విద్యుత్, త్రాగునీరు, పరిశుభ్రత వంటి సమస్యలపై చర్చించి పరిష్కార మార్గాలను పరిశీలించారు.గ్రామ పంచాయతీ కార్యదర్శి హేమలత, ఉప సర్పంచ్ నాగమణి, వార్డు సభ్యులు సురేష్ కుమార్, నరేష్, ఉదయ్, మనీషా, స్వాతి, దీపిక, స్వరూపతో పాటు గ్రామ నాయకులు బిక్షపతి, బాలయ్య, కుమార్ పాల్గొన్నారు. గ్రామంలోని యువకులు, మహిళలు కూడా సభలో హాజరై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

## నా నేస్తం ట్రస్ట్ ఆధ్వర్యంలో సమ్మక్క సారలమ్మ జాతరలో ఉచిత తాగునీటి పంపిణీ




**ఎలిగేడు, జనవరి 28 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** లాలపల్లి ఎలిగేడు పెండ్లి పోరు గుట్ట మీద నాలుగు రోజులు జరిగే జాతర లో భక్తుల సౌకర్యం నా నేస్తం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత తాగునీటి పంపిణీ కార్యక్రమం ఎలిగేడు, లాల పల్లె గ్రామాల సర్పంచులు కప్పల ప్రవీణ్, ఏలేటి వెంకటరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతర వచ్చే భక్తులకు తాగునీరు అందించడం చాలా అభినందనీయమని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు మామిడి ఢిల్లీశ్వర్ రెడ్డి, కొత్తిరెడ్డి మల్లారెడ్డి, కట్ల సత్యనారాయణ, వార్డు సభ్యులు బ్రహ్మోజు సంజీవ్ కుమార్, పల్లె కార్తిక్, ఎలిగేడు పాఠశాల విద్యా కమిటీ మాజీ చైర్మన్ అడ్డగుట్ట తిరుపతి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## వనం నుండి జనంలోకి



సారలమ్మను గద్దె పైకి తీసుకు వస్తున్న కోయ పూజారులు

**ఎలిగేడు, జనవరి 28(నీలగిరి ఎక్స్ ప్రెస్):** కోరిన కోరికలు తీర్చి కొంగుబంగారంగా నిలిచే సారలమ్మ వనం నుండి జనంలోకి బుధవారం భక్తుల దర్శనార్థం గద్దెలకు చేరనుంది. మండల కేంద్రం నుండి లాలపల్లె ఎలిగేడు గ్రామ శివారు ప్రాంతంలోని పెళ్లి పోరు గుట్ట వద్దకు అంగరంగ వైభవంగా కోలాటాలతో నృత్యాలతో అమ్మవారికి భక్తులు స్వాగతం పలికారు. కోయ పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని గద్దెలపై ప్రతిష్టించారు. ఈ అద్భుతమైన ఘట్టంలో వివిధ గ్రామాల సర్పంచులు జాతర నిర్వహణ కమిటీ సభ్యులు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులయ్యారు. అమ్మవారి ఆశీర్వాదంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతమైన వాతావరణంలో శోభాయాత్ర వలె అమ్మవారి గమనం జరిగిందని చెప్పవచ్చు. రెవెన్యూ,, పోలీస్ అధికారులతో పాటు జాతర నిర్వహణ కమిటీ సభ్యులు, రెండు గ్రామాల్లోని వాలంటరీలు,, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. సమ్మక్క సారలమ్మ జాతర ఏర్పాట్లపై మండల పరిధిలోని వివిధ గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## వంగూరు తాహసిల్దార్ మురళీమోహన్, గిర్ధవర్ శేఖర్‌కు జిల్లాస్థాయి ఉత్తమ అవార్డు



**వంగూరు, జనవరి 28(నీలగిరి ఎక్స్ ప్రెస్)** : వంగూరు మండల కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న తాహసిల్దార్ మురళీమోహన్, గిర్ధవర్ శేఖర్‌లకు సోమవారం జిల్లా కేంద్రంలో జరిగిన గణతంత్ర వేడుకల్లో జిల్లాస్థాయి ఉత్తమ అవార్డు లభించింది. నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ సంతోష్, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి చేతుల మీదుగా ప్రశంసపాత్రాన్ని అందుకున్నారు.ఈ సందర్భంగా వంగూరు కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ గౌడ్, టౌన్ ప్రెసిడెంట్ గాఫూర్ అధికారులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు హమీద్, సైదులు, నరందర్ గౌడ్, కృష్ణ, స్వామి, జనార్దన్, శ్రీను, వెంకట్ గౌడ్, సురేష్, మలేష్ గౌడ్, రమేష్, కొండల్, శేఖర్, రమేష్ గౌడ్, సురేష్‌తో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మొదలైన నామినేషన్ల ప్రక్రియ



6వ వార్డు

**ఆమనగల్లు, జనవరి 28(నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
ఆమనగల్లు పట్టణ మున్సిపాలిటీలో ఎన్నికల సందడి మొదలైంది. మున్సిపాలిటీలో మొదటి నామినేషన్ ను ఆరవ వార్డు టిఆర్ఎస్ అభ్యర్థి పత్య నాయక్ నామినేషన్ దాఖలు చేశారు. ఎన్నికల అధికారుల సమక్షంలో నామినేషన్ పత్రాలను అధికారికంగా అందజేశారు. కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై పత్య నాయక్ కు మద్దతు తెలిపారు.

## నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన ఏసీపీ




నామినేషన్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఏసీపీ

ఆమనగల్లు మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఎన్నికల నామినేషన్ కేంద్రాన్ని బుధవారం మహేశ్వరం ఏసీపీ జానకీ రెడ్డి, సీఐ జానకీ రాం రెడ్డి, ఎస్సై వెంకటేష్ తో కలిసి నామినేషన్ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం నామినేషన్ కేంద్రంలో ఏర్పాటుచేసిన హెల్ప్ డెస్క్ ను పరిశీలించారు. నామినేషన్ ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు సంబంధిత ఎన్నికల అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్ పాల్గొన్నారు.


## మున్సిపాలిటీలో ఎనిమిది నామినేషన్లు దాఖలు



8 నామినేషన్ పత్రాలు దాఖలు అయినట్లు తెలిపిన మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్

**నీలగిరి ఎక్స్ ప్రెస్, ఆమనగల్లు :**
ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డులకు సంబంధించి నామినేషన్ ప్రక్రియ ముగిసింది. నేడు మొత్తం 8 నామినేషన్లు దాఖలైనట్లు మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్ తెలిపారు. నామినేషన్ ల స్వీకరణను ఎన్నికల నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహి స్తున్నామని చెప్పారు. అభ్యర్థులు, పార్టీ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.


### మున్సిపాలిటీ బిఆర్ఎస్ 8వ వార్డు అభ్యర్థిగా రమేష్ నామినేషన్ దాఖలు



8వ వార్డు బీఆర్ఎస్ అభ్యర్థి రమేష్8వ వార్డు బీఆర్ఎస్ అభ్యర్థి రమేష్

**నీలగిరి ఎక్స్ ప్రెస్, ఆమనగల్లు :**
ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలో ఎన్నికల సందడి మొదలైంది. మున్సిపాలిటీలోని 8 వ వార్డు బీఆర్ఎస్ అభ్యర్థి రమేష్ నామినేషన్ దాఖలు చేశారు. ఎన్నికల అధికారుల సమక్షంలో నామినేషన్ పత్రాలను అధికారికంగా అందజేశారు. కార్యక్రమానికి పార్టీ నాయకులు హాజరై, రమేష్ కు మద్దతు తెలిపారు.

### కాంగ్రెస్ పార్టీ 12వ వార్డు అభ్యర్థిగా అప్పం శీను నామినేషన్ దాఖలు




12వ వార్డు

**నీలగిరి ఎక్స్ ప్రెస్, ఆమనగల్లు :**
ఆమనగల్లు పట్టణ మున్సిపాలిటీలో ఎన్నికల సందడి మొదలైంది. మున్సిపాలిటీలో 12వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా అప్పం శీను నామినేషన్ దాఖలు చేశారు. ఎన్నికల అధికారుల సమక్షంలో నామినేషన్ పత్రాలను అధికారికంగా అందజేశారు. కార్యక్రమానికి పార్టీ నాయకులు కార్యకర్తలు హాజరై కు మద్దతు తెలిపారు.




# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



**వెల్దండ, జనవరి 28(నీలగిరి ఎక్స్ ప్రెస్)** వెల్దండ మండల పరిధిలోని నారాయణపూర్ గేట్ సమీపంలో బుధవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. హైదరాబాద్ శ్రీశైలం జాతీయ రహదారిపై డీసీఎం వ్యాను ఒక కారును బలంగా ఢీకొట్టడంతో కారులో ఉన్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు కడ్తాల మండలంలోని సరికొండ గ్రామానికి చెందిన వల్లబు దాస్ వెంకటేష్‌గా గుర్తించారు. తీవ్ర గాయాలతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎస్సై కురుమూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# మున్సిపాలిటీ ఎన్నికల కోసం బి.ఆర్.ఎస్ తొలి జాబితా విడుదల

**ఇబ్రహీంపట్నం, జనవరి 28(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో బి.ఆర్.ఎస్ పార్టీ ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ ఎన్నికల అభ్యర్థుల తొలి జాబితాను ప్రకటించింది. ఈ జాబితాలో తొమ్మిది వార్డుల అభ్యర్థుల పేర్లు ఉన్నాయి. ఇందులో 2వ వార్డులో సయ్యద్ హిదాయత్ అలీ, 3వ వార్డులో తాళ్ల వెంకటేష్ గౌడ్, 7వ వార్డులో టేకుల సుదర్శన్ రెడ్డి, 13వ వార్డులో ఆకుల సురేష్, 15వ వార్డులో క్యామ శంకర్, 17వ వార్డులో మడుపు లక్ష్మీ గోపాల్, 19వ వార్డులో ఆకుల యాదగిరి, 23వ వార్డులో నీలం శ్వేతా బాలు, 24వ వార్డులో గూడూరు గిరి పోటీ చేయనున్నారు. ఈ జాబితా విడుదలతో ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ ఎన్నికల పోటీకి బి.ఆర్.ఎస్ పార్టీ సన్నద్ధమైందని నాయకులు తెలిపారు.

# పేద ప్రజలకు గృహకల్పనే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ లక్ష్యం

- లబ్ధిదారుని ఇందిరమ్మ ఇల్లుకు శంకుస్థాపన
- కడ్తాల్ పట్టణ సర్పంచ్ - రాయికంటి బిక్షపతి
- డిసిసి అధికార ప్రతినిధి - గూడూరు శ్రీనివాస్ రెడ్డి



**కడ్తాల్, జనవరి 28 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ ) :**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల గృహ స్వప్నాన్ని సాకారం చేయాలనే లక్ష్యంతో అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద కడ్తాల్ మండల కేంద్రానికి చెందిన డెవోజు కల్పన గారికి మంజూరైన సందర్భంగా కడ్తాల్ పట్టణ సర్పంచ్ రాయికంటి బిక్షపతి గారు, డిసిసి అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి గారితో మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి శంకుస్థాపన చేసి ప్రొసీడింగ్స్ అందజేశారు. ఈ సందర్భంగా కడ్తాల్ పట్టణ సర్పంచ్ రాయికంటి బిక్షపతి, డిసిసి అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమమే పరమావధని, ప్రతి పేద కుటుంబానికి ఇల్లు కలగాలనే ఆత్మీయతతో తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి ఆధ్వర్యంలో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. నియోజకవర్గ ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి గారి సహకారం ద్వారా ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన కుటుంబాలకు గృహ నిర్మాణానికి కావాల్సిన ఆర్థిక సహాయం అందుతన్నారు. పేద కుటుంబాలకు గృహం కేవలం ఇల్లు కాదు, అది వారి గౌరవప్రదమైన జీవితానికి పునాది అని తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ప్రతి పేద కుటుంబం జీవితంలో వెలుగు నింపుతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు స్పందిస్తూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎన్ని సార్లు మొరపెట్టుకున్నా పట్టించుకునే నాథుడే లేరన్నారు. కానీ ఈ రేవంతన్న ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇళ్లు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులకు ధన్యవాదాలనీ అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అల్లాజీ, వార్డు సభ్యులు మల్లయ్య, జాంగిర్ బాబా, కర్రోళ్ల రమేష్, చేగురి మహేష్, భానుకిరణ్, మంకీ మహేష్, ముత్తి కృష్ణ, రవికుమార్ మరియు మండల పార్టీ అధ్యక్షుడు బిచ్యా నాయక్, పట్టణ పార్టీ అధ్యక్షుడు మాలే మల్లేష్ గౌడ్, రంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి క్యామ రాజేష్, సత్యం యాదవ్, జహంగీర్ అలీ, రామకృష్ణ, శేఖర్ రెడ్డి, మంకీ శ్రీను, ఇమ్రాన్ బాబా, సత్యం మరియు తదితరులు పాల్గొన్నారు.

# కాశ్మీర్‌లో భారీగా కురుస్తున్న మంచు

**శ్రీనగర్‌కు పలు విమానాలు రద్దు**



**శ్రీనగర్, జనవరి 28(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
జమ్మూకశ్మీర్‌లో గత కొన్ని రోజులుగా మంచు కురుస్తుండటంతో భారీగా మంచు చరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనకు సంబంధించి ఇప్పటివరకు ఎలాంటి ప్రాణనష్టం లేదని అధికారులు పేర్కొన్నారు. దీనికి సంబంధించిన దృశ్యాలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. గండేర్‌బల్ జిల్లాలోని సోనామార్గ్‌లో మంగళవారం రాత్రి ఈ ఘటన జరిగింది. పలు ఇళ్లు, రిసార్ట్‌లు, వాహనాలను మంచు కప్పేసింది. ఘటన తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో రెస్క్యూ సిబ్బంది, స్థానిక అధికారులు అక్కడికి చేరుకొని.. సహాయక చర్యలు ప్రారంభించారు. అయితే, ఇప్పటివరకు ఎలాంటి ప్రాణనష్టం లేదని అధికారులు వెల్లడించారు. మంగళవారం కశ్మీర్ అంతటా మంచు తీవ్రంగా కురిసిన క్రమంలో.. అధికారులు జమ్మూ-శ్రీనగర్ జాతీయరహదారిని మూసివేశారు. శ్రీనగర్ విమానాశ్రయంలో పలు విమానాలను రద్దు చేశారు. దీంతో అనేకమంది పర్యాటకులు అక్కడే చిక్కుకుపోయారు.

# చండీఘడ్‌లో బాంబు బెదిరింపు మెయిల్స్..

**అనేక ప్రైవేటు స్కూళ్లు ఖాళీ**




**చండీఘడ్: జనవరి 28(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
చండీఘడ్‌లోని అనేక ప్రైవేటు స్కూళ్ల కు బాంబు బెదిరింపులు వచ్చాయి. దీంతో విద్యార్థులు, పేరెంట్స్ ఆందోళనకు గురయ్యారు. సుమారు అయిదు ప్రైవేటు స్కూళ్లకు బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చినట్లు తెలుస్తోంది. సెయింట్ కబీర్, వివేక్ హై, భవన్ విద్యాలయ, సేక్రడ్ హార్ట్, చిత్కారా స్కూళ్లకు బెదిరింపు వచ్చినట్లు భావిస్తున్నారు. కొన్ని ప్రభుత్వ స్కూళ్లకు కూడా బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. ఈ నేపథ్యంలో చండీఘడ్‌లో ఎమర్జెన్సీ సైరన్లను మోగించారు. బాంబు బెదిరింపు మెయిల్స్ రాగానే స్కూల్ యజమానులు ఈ విషయాన్ని పోలీసులకు చేరవేశారు. స్కూళ్లను పోలీసులు ఖాళీ చేయించారు. విద్యార్థులను బయటకు పంపారు. విద్యార్థులను ఇండ్లకు పంపించారు. బాంబు బెదిరింపుల నేపథ్యంలో చండీఘడ్ పరిపాలనా శాఖ అడ్వైజరీ జారీ చేసింది. ఆందోళనకు గురికావొద్దు అని, ప్రశాంతంగా ఉండాలని స్కూళ్లను ప్రభుత్వం కోరింది. పూర్తి స్థాయిలో చెకింగ్ నిర్వహించేందుకు అన్ని లొకేషన్లకు బాంబు స్క్వాడ్‌లను పంపారు.

# అమెజాన్‌లో 16 వేల మందిపై వేటు..

**అధికారికంగా ప్రకటించిన సంస్థ**

**న్యూఢిల్లీ, జనవరి 28(నీలగిరి ఎక్స్ ప్రెస్)**




ప్రపంచ వ్యాప్తంగా 16 వేల మంది ఉద్యోగులను తొలగిస్తున్నట్టు ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ బుధవారం ప్రకటించింది. ఏఐ ఒత్తిడిలో వ్యాపార పునర్‌నిర్మాణంలో భాగంగా ఈ తొలగింపులు చేపట్టినట్టు సీనియర్ వైస్ ప్రెసిడెంట్ బెత్ గలెట్టీ తెలిపారు. దీని కారణంగా ప్రభావితమైన ఉద్యోగులు అంతర్గతంగా కొత్త ఉద్యోగం వెతకడానికి 90 రోజుల సమయం ఇస్తామని, కొత్త ఉద్యోగం కనుగొనలేని, లేదా అందులో చేయకూడదని నిర్ణయించుకున్న వారికి అవుట్‌ప్లేస్‌మెంట్ సేవలు, ఆరోగ్య బీమా వర్తించే విధంగా మద్దతు అందిస్తామని తెలిపింది.

**టెక్సాస్‌లో హెచ్-1బీ నియామకాలు బంద్!**

టెక్సాస్: హెచ్-1బీ వీసాల పిటిషన్లను రాష్ట్రమంతటా వెంటనే స్తంభింపచేయాలని టెక్సాస్ గవర్నర్ గ్రెగ్ అబోట్ ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర ఏజెన్సీలు, పబ్లిక్ యూనివర్సిటీల్లో దీన్ని అమలు చేయాలని పేర్కొన్నారు. అమెరికాలోని ఉద్యోగాలు అమెరికన్లకే దక్కాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. 2027 మే 31 వరకు ఈ నిర్ణయం అమల్లో ఉంటుందని వెల్లడించారు. తాజా నిర్ణయం భారత ఉద్యోగులు, విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపనుంది. టెక్సాస్ యూనివర్సిటీల్లో వందలాది మంది భారతీయులు ఉద్యోగులుగా ఉన్నారు.

# రాజకీయాల్లో నవ విప్లవం రావాలి

**-యువతకు, మహిళలకు పెద్దపీట వేస్తూ 'జాగృతి' అడుగులు కప్పాటి పాండురంగారెడ్డి**




**రంగారెడ్డి , జనవరి 28(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
"సంకల్పం, సేవాభావం కలిగిన యువత రాజకీయాల్లోకి వచ్చినప్పుడే సమాజంలో నిజమైన మార్పు సాధ్యమవుతుంది" అని తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కప్పాటి పాండురంగారెడ్డి పేర్కొన్నారు. బుధవారం జాగృతి నాయకులు కుమ్మరి శివశంకర్, ఉండెల బాబురావు తో కలసి ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై ఆయన స్పందిస్తూ, యువతరం ముందుకు రావాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పారు. ఒకప్పుడు విలువలతో కూడిన రాజకీయాలు ఉండేవని, నేటి కాలంలో అవి కరువవుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తరం మారుతున్న కొద్దీ కొత్త ఆలోచనలు, కొత్త ఆకాంక్షలు కలిగిన యువత రాజకీయాల్లోకి రావడం చారిత్రక అవసరమని తెలిపారు. ఆధునిక అవసరాలకు అనుగుణంగా పనిచేసే యువ నాయకత్వాన్ని ప్రోత్సహించడం ద్వారానే భవిష్యత్ తెలంగాణకు బలమైన పునాదులు వేయగలమని, రేపటి తరానికి ఆదర్శంగా నిలవగలమని ధీమా వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో పార్లమెంటరీ విధానం ద్వారానే సామాజిక విప్లవం సాధ్యమని నమ్మి, కల్వకుంట్ల కవితమ్మ గారు 'జాగృతి'ని రాజకీయ వేదికగా తీర్చిదిద్దుతున్నారని వెల్లడించారు. ఈ నూతన ప్రస్థానంలో యువతకు పెద్దపీట వేస్తూ, మహిళలకు సముచిత స్థానం కల్పిస్తూ, ఉద్యమకారుల ఆకాంక్షలకు అనుగుణంగా అడుగులు వేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర రాజకీయాల్లో ఒక నూతన ఒరవడిని సృష్టించి, చరిత్రలో నిలిచిపోయేలా పనిచేయాలన్న కృత నిశ్చయంతో ఉన్నామని, ఈ సామాజిక, రాజకీయ యజ్ఞంలో యువత పెద్ద ఎత్తున భాగస్వాములు కావాలని పాండురంగారెడ్డి ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

# దేశంలో 25 కోట్ల మందికి పేదరికం నుంచి విముక్తి

**న్యూఢిల్లీ, జనవరి 28(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
గడిచిన పదేళ్ల ఎన్డీఏ పాలన లో దేశంలో 25 కోట్ల మందికి పేదరికం నుంచి విముక్తి కల్పించామని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. బుధవారం పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా ఉభయ సభలను ఉద్దేశించి ముర్ము ప్రసంగించారు. అదేవిధంగా దేశంలో 10 కోట్లకు పైగా గ్యాస్ కనెక్షన్లు అందించామని చెప్పారు.ఆయుష్మాన్ భారత్ ద్వారా కోట్ల మందికి వైద్య సేవలు అందిస్తున్నామని, వికసిత్ భారత్‌లో రైతులకు ప్రథమ ప్రాధాన్యం ఇచ్చామని, వ్యవసాయ మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తున్నామని రాష్ట్రపతి అన్నారు. గ్రామీణ ఉపాధి కల్పన కోసం జీ రామ్ జీ చట్టాన్ని తీసుకువచ్చామన్నారు. వెనుకబడిన వర్గాల



సంక్షేమమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యమని అన్నారు. ఆత్మనిర్భర్ భారత్ సాధన కోసం కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్రపతి పేర్కొన్నారు. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని దేశం సంస్కరణల పథంలో దూసుకెళ్తోందని అన్నారు. పీఎల్ఐ పథకం కింద పారిశ్రామికోత్పత్తిని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల్లో గణనీయమైన ప్రగతి సాధించామని చెప్పారు. సముద్ర వ్యాపారాన్ని మరింత పెంచేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు వెల్లడించారు. గత ఏడాది నిర్వహించిన ఆపరేషన్ సింధూర్ ద్వారా భారత సైన్యం మన సత్తాను ప్రపంచానికి చాటి చెప్పిందన్నారు. భారత్‌పై దాడిచేస్తే ఏం జరుగుతుందో ప్రపంచం మొత్తం చూసిందని రాష్ట్రపతి అన్నారు. ఈ ఆపరేషన్ తర్వాత డిఫెన్స్ ఎగుమతులు రికార్డు స్థాయిలో పెరిగినట్లు వెల్లడించారు.

# అమెరికాలో ఇమ్మిగ్రేషన్ రగడ..

**గీడెమోక్రటిక్ నేత ఇల్హాన్ ఒమర్‌పై దాడి**

**మిన్నసొట్ట- జనవరి 28(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
అమెరికాలో ఇమ్మిగ్రేషన్ శాఖ చర్యలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న డెమోక్రటిక్ పార్టీ మహిళా నేత ఇల్హాన్ ఒమర్‌పై దాడి చేశారు. మిన్నసొట్టాలో ఓ మీటింగ్‌లో మాట్లాడుతున్న సమయంలో చట్టసభ ప్రతినిధి ఒమర్‌పై ఓ వ్యక్తి ద్రవాన్ని చల్లాడు. అయినా ఆ ప్రతినిధి వెనుకడుగు వేయకుండా తన స్వరాన్ని వినిపించారు. సొమాలియాలో పుట్టిన అమెరికా ప్రతినిధి అయిన ఇల్హాన్ చాన్నాళ్లుగా ట్రంప్ విధానాలను వ్యతిరేకిస్తున్నారు. ఇమ్మిగ్రేషన్ ఏజెంట్ల చేతుల్లో ఇప్పటికే ఇద్దరు మరణించారు. ఈ నేపథ్యంలో



హోంల్యాండ్ సెక్యూర్టీ చీఫ్ రాజీనామా చేయాలని ఆమె డిమాండ్ చేశారు. అమెరికా ప్రతినిధి ఇల్హాన్ ఒమర్‌పై దాడి చేసిన వ్యక్తిని 55 ఏళ్ల ఆంటోనీ కజిమిరేచాక్‌గా గుర్తించారు. ఒమర్‌పై ద్రవాన్ని చల్లిన సమయంలోనే అక్కడ ఉన్న పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకున్నారు. ఆ దాడిలో ఎటువంటి గాయాలు లేకుండా ఆమె బయటపడ్డారు. నిందితుడిని పట్టుకున్న సమయంలో ఆ మహిళా నేత భయపడకుండానే అతని వైపు దూసుకెళ్లారు. ఏ కారణం చేతలో నిందితుడు దాడికి పాల్పడ్డారో ఇంకా తెలియదు. ప్రస్తుతం మిన్నియాపోలీసులో తీవ్ర స్థాయిలో ఇమ్మిగ్రేషన్ ఏజెంట్ల చెకింగ్ చేస్తున్నారు. ఆధారాలు సరిగా లేని వారిని డిపోర్ట్ చేస్తున్నారు.

# రూ.87 కోట్ల విలువైన సాఫ్ట్‌వేర్ డేటా చోరీ..

**బెంగళూరు: జనవరి 28(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
సాఫ్ట్‌వేర్ కంపెనీలో పని చేసిన ఐటీ ఇంజినీర్ రూ.87 కోట్ల విలువైన సాఫ్ట్‌వేర్ డేటా చోరీ చేశాడు. సాఫ్ట్‌వేర్ సోర్స్ కోడ్‌ను దొంగిలించాడు. ఈ నేపథ్యంలో ఆ టెకీని ఉద్యోగం నుంచి ఆ కంపెనీ తొలగించింది. ఆ తర్వాత ఆయనపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. (హ్యుశ్రీఅఅస్త్ర వాశీట్ఝుతీవ ఖఘు) దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కర్ణాటక రాజధాని బెంగళూరులో ఈ సంఘటన జరిగింది. అమేడియస్ సాఫ్ట్‌వేర్ ల్యాబ్స్ ఇండియా (పి) లిమిటెడ్ కంపెనీలో 2020 ఫిబ్రవరి 1 నుంచి ఆశుతోష్ నిగమ్ సీనియర్ మేనేజర్ రీసెర్చ్ సైంటిస్ట్‌గా పనిచేస్తున్నాడు.కాగా, 2025 అక్టోబర్ 11న ఆశుతోష్ నిగమ్ కంపెనీకి చెందిన సాఫ్ట్‌వేర్‌తో పాటు సోర్స్ కోడ్‌ను వ్యక్తిగత ఇమెయిల్ ఖాతా నుంచి బయటకు ట్రాన్స్‌ఫర్ చేసినట్లు ఆ సంస్థ ఆరోపించింది. అంతర్గత దర్యాప్తు, ఫుటేజ్, నివేదికలతో అతడ్ని నిలదీయగా సోర్స్ కోడ్‌ను దొంగిలించినట్లు అంగీకరించాడని తెలిసింది. దీంతో గత ఏడాది డిసెంబర్ 3న ఉద్యోగం నుంచి తొలగించినట్లు పేర్కొంది. మరోవైపు టెకీ ఆశుతోష్ నిగమ్ చోరీ చేసిన సాఫ్ట్‌వేర్, సోర్స్ కోడ్ విలువ 8,000,000 యూరోలు (సుమారు రూ.87 కోట్లు) అని ఆ ఐటీ సంస్థ తెలిపింది. దీని వల్ల కంపెనీ మేధో సంపత్తి హక్కులకు భంగం కలగడమే కాకుండా, కంపెనీకి తీవ్రమైన వ్యాపార నష్టం, హాని జరిగినట్లు ఆరోపించింది. జనవరి 23న వైట్‌ఫీల్డ్ సీఈఎన్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో ఆశుతోష్ నిగమ్‌పై ఐటీ చట్టంలోని సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు పోలీస్ అధికారి తెలిపారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.